ఆదివారం

ప్రజాశక్తి

డిసెంబర్ 28, 2003

రాజ్ కుమార్

నూతన సంవత్సర శుభాకాంక్షలు

కృష్ణజింక

హ్యాపీ బర్త్‌డే

(28-12-2003నుండి 3-1-2004వరకు)

పి. రాజేశ్వరి
7సం॥, 28.12.1996
సుజాత- బాలకృష్ణ
వనపర్తి- మ॥నగర్

వి. సాయి ప్రీతి
5సం॥, 28.12.1998
శారద-శ్రీనివాస్
రోటిగూడ-ఆదిలాబాద్

అలేఖ్య
10సం॥, 28.12.1993
వనజ-దీక్షితులు
పామర్రు-ప్రకాశం

వి. సాయికృష్ణ భార్గవ్
డిసెంబర్-29
రేవతి-ప్రసాదరావు
పెనుబల్లి-ఖమ్మం

వై. సుమన
1సం॥, 30.12.2002
మమత-పార్థసారథి
కొత్తపేట-హైదారాబాద్

సంతోషకుమార్-సాయిరామ్‌కిషోర్-సాయి కిరణ్
డిసెంబర్-30
రోజా- శ్రీనివాసరావు
ఖమ్మం

బి. రవి
8సం॥, 30.12.1995
ఆదిలక్ష్మి-భాస్కరరావు
ఆకివీడు-ప॥గో॥

పి. నాని
3సం॥, 1.1.2001
రజని- దామోదర్
హైదరాబాద్

అమల్ తేజ-అఖిల్ తేజ
జనవరి-1
బిబిమోల్-టి.ఎ.మత్వాస్
పామర్రు-కృష్ణా

ఆశ్లేష్
2సం॥, 2.1.2002
మాధురి- జయశంకర్
నరసన్నపేట-శ్రీకాకుళం

వై. శ్రావణి
2సం॥, డిసెంబర్-2001
తులసి-నారాయణ
కెపిహెచ్‌బి మెయిన్‌రోడ్డు-పెద్దబాదు

మహ్మద్‌రిషఫ్(సిజ్జు)
1సం॥,డిసెంబర్-2002
సజ్జుషకీలషఫీ
బెల్లంపల్లి-ఆదిలాబాద్

పవన్
సుజాత-సురేష్ యాదవ్
శంషాబాద్-రంగారెడ్డి

ఉషశ్రీ
1సం॥, డిసెంబర్-2002
పరమేశ్వరి-శాల్వాచారి
ఆరుట్ల-రంగారెడ్డి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



కదలిక ఆలోచింపచేసింది

డిసెంబర్ 14వ తేదీ సంచికలో ప్రచురించిన కదలిక కథ ఆలోచింపచేసేదిగా ఉంది. రాష్ట్రంలో రైతులు పడుతున్న కష్టాలు, వారిని మోసగిస్తున్న దళారులు, పట్టించుకోని ప్రభుత్వం, పోరాటం సాగించాల్సిన ఆవశ్యకత గురించి రచయిత చక్కగా వివరించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఇటువంటి సమస్యలపై కథలు ఆలోచింపచేసేవిగా ఉంటాయి. ఈ తరహా కథలు తరచుగా ప్రచురించగలరు.

వి. మురళీధర్, నిజామాబాద్
ఎ. కృష్ణారావు, బ్రాడీపేట, గుంటూరు

భూమిక థియేటర్

భూమిక థియేటర్ గ్రూప్ విత్ డిఫరెన్స్ వ్యవస్థాపకులు, దర్శకులు ఉదయభాను ఇంటర్వ్యూ విశేషాలు బాగున్నాయి. భారత ప్రభుత్వం గ్రాంటు ఇవ్వడం బట్టి ఈ సంస్థకు వున్న పేరు ప్రఖ్యాతులు వెల్లడైనాయి. ప్రస్తుతం టీవీ, సినిమా ప్రభంజనానికి ఎదురు నిలిచి ప్రదర్శనలివ్వటం అభినందించతగ్గ విషయం.

– షేక్ ఆలీవలి, మొగల్తూరు



అభినందనలు

'ఎన్నికల యంత్రం' కవర్ స్టోరీలో ఎన్నికల సంఘం దాని స్వరూప స్వభావాలు, పరిధి, విధులు గురించి ఎంతో విలువైన సమాచారాన్ని అందించింది. స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా దీనిని రాజ్యాంగం నిర్దేశించటం వల్ల ఎన్నికల సంఘం స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించే వీలు కలిగింది. వివిధ ఎన్నికల కమీషనర్లు, వారి వ్యవహారశైలీ, ఈ సంఘం ఏర్పడిన తరువాత భారతదేశంలో జరిగిన ఎన్నికల తీరుతెన్నులు వ్యాసంలో ప్రముఖంగా చర్చించబడ్డాయి. రాజకీయాలకు అతీతంగా ఎన్నికల్లో ప్రజాభిప్రాయాన్ని నిష్పక్షపాతంగా ప్రతిబింబింప చేయటంలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న పాత్ర నిరుపమానమైంది. నైతిక సూత్రాలకు పెద్దపీట వేస్తూ ప్రధాన ఎన్నికల కమీషనర్ జె.ఎం.లింగ్డో వనితీరు ప్రశంసావహంగాను, ఆదర్శప్రాయంగాను ఉంది.

– మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా.

రియల్‌స్టోరీ బాగుంది

14 డిసెంబర్ 2003 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన చదువుకోసం ఆరాటం, ఒంటికాలితో పోరాటం చదువుకోవాలన్న జిజ్ఞాసతో, చదువుమీద ఉన్న ధ్యాసలో తనకు కాలు లేకపోయినా, ఒంటికాలితో, ఉత్సాహంతో చదువుకోవాలనుకునే ఓ విద్యార్థి జీవితం నిజంగా ఊహించని విజయానికి సంకేతమనే చెప్పాలి. ఇంత మంచినిర్ణయం తీసుకున్న ఈ విద్యార్థికి హ్యాట్సాఫ్ చెప్పక తప్పదు.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

టూరిస్ట్ గైడ్ బాగుంటోంది

జిల్లాల వారీగా పర్యాటక ప్రదేశాల గురించి ఇస్తున్న సమాచారం ఉపయోగకరంగా ఉంటోంది. ఇదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల సమాచారం సంక్షిప్తంగా ఇవ్వగలరు.

– పి. శివాజీ
ఆటోనగర్, విజయవాడ

మనలో మాట

మా ఊళ్ళో సముద్రం...

సమస్తమైన ఊళ్ళల్లో సముద్రాలుండవు!

మా ఊళ్ళో మాత్రం గొప్ప సముద్రముంది!

సముద్రమున్న ఊళ్ళో నాగరికతకు నిత్య పట్టాభిషేకం జరుగుతుందని చిన్నప్పుడు ఎక్కడో చదువుకున్నట్టు గుర్తు!

అందువల్ల-

మా ఊళ్ళో మేలైన నాగరికతకు కరువు లేదని కూడా చెబుతాను!

మా ఊళ్ళో మహామేధావులతో పాటు పండితులెక్కువ! రచయితలెక్కువ! కవులెక్కువ. కళాకారులెక్కువ!

పిచ్చివాళ్ళ సంఖ్య కూడా ఎక్కువే!

నవ్వుకుంటున్నారల్లె వుంది! పిచ్చివాళ్ళను తీసిపారేయకండి. ఆ మాటకొస్తే - రచయితలూ కవులూ కళాకారులూ మౌలికంగా పరమ పిచ్చివాళ్ళే!

ఉన్నది లేనట్టూ లేనిది వున్నట్టూ - వాస్తవానికి దూరంగా - గొప్ప గొప్ప కథలూ కమ్మని కవిత్వాలూ ఎట్లా పుట్టుకొస్తాయి?

మా ఊళ్ళో-

పిచ్చివాళ్ళు గాల్లో చేతులూపుకుంటో - అర్థంగాని భాషలో ఎవర్నో తిట్టుకుంటో - భేషని మెచ్చుకుంటో కనిపిస్తారు!

రచయితలూ కవులూ కళాకారులు కూడా రోడ్డు మీద నడుస్తూనే తమ భవిష్యత్ కార్యక్రమాలకు రూపకల్పన విషయమ్మై గాలితోనే చర్చించుకుంటారు!

ఇంత రభసకి కారణం మా ఊరి సముద్రం!

మా ఊరి సముద్రం మమ్మల్ని కన్నతల్లిలా ఆదుకుంటోంది! శ్రేష్ఠమైన ఉప్పుగాలితో మమ్మల్ని బద్ధకస్తులుగా తీర్చిదిద్దుతోంది. బద్ధకం అదుపులో వున్నప్పుడు మనిషి మెదడు గొప్ప కళాసృష్టికి సహకరిస్తుంది! అదుపు తప్పితే మెదడ్ని పాడు చేస్తుంది!

ఈ కారణంగానే - మా ఊళ్ళో వాళ్ళూ వీళ్ళూ ఎక్కువ సంఖ్యలో కనిపిస్తూ వుంటారు!

మా వాళ్ళకి సభలూ సమావేశాల మీద మోజెక్కువ!

నడిరోడ్డు మీద ఇద్దరు నిలబడి ముచ్చట్లు చెప్పుకోడం చూస్తే - దారిన పోయే మూడో మనిషి ఓర్చుకోలేడు. వాళ్ళేం మాటాడుకుంటున్నారో తెలుసుకోవాలనుకుంటాడు. అంచేత వాళ్ళ అనుమతి లేకుండానే వాళ్ళల్లో చేరిపోతాడు!

పది నిమిషాల్లో -

ఆ ముగ్గురూ ముప్పై మంది అవుతారు!

పురమందిరంలో పండిత గోష్ఠి జరుగుతున్నప్పుడు - అది పండితులకు మాత్రమే పరిమితమనే విషయం పట్టించుకోరు! అది ఏ టైపు సభైనా ప్రేక్షకులు మాత్రం పెద్ద సంఖ్యలో హాజరవుతారు!

ఈ నేపథ్యంలో -

"మా పార్టీ సభకి అధిక సంఖ్యలో జనం వచ్చేరు గనక - విజయం మాదే" అని ఏ పార్టీ వారు అభిప్రాయపడినా అది తొందరపాటే అవుతుంది!

మా ఊరి సముద్రం లోతు పార్టీ పెద్ద మనిషికి తెలీనట్టే - మా ఊరి ఓటరు ఎంపిక చేసే నేతని కూడా పోల్చుకోలేడు!

ఈ సంచికలో . . .

ఔరా! . . . 3
కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

మూడో చేప కథ కథ ... 8

వెలుగు దివ్వె
రియల్‌స్టోరీ . . . 14, 15

పర్యాటకులను ఆకట్టుకునే కరీంనగర్
టూరిస్ట్ గైడ్ . . . 21



మహానట కంఠీరవ రాజ్‌కుమార్
కళాసాహితి . . . 22

గోరా!

లండన్‌లో బాలీవుడ్



మీద పడుతున్న ముసలితనాన్ని కప్పిపుచ్చుకోవడం, అందం పెంచుకోవడం కోసం ప్లాస్టిక్ సర్జరీలు వగైరా చేయించుకోవడం సినీ తారలకు అవసరం. అయితే ఇండియాలో చేయించుకుంటే సినీ జనానికి, ప్రజలకు తెలిసిపోతుందనే భయంతో బాలీవుడ్ తారలు ఇటీవల లండన్‌కు క్యూ కడుతున్నారట. లండన్‌లో గల ఒక సెలూన్ బాలీవుడ్ తారలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి వారి నాజూకుతనాన్ని కాపాడటానికి, వృద్ధాప్యం కనపడకుండా చేయడానికి తన వంతు కృషి చేస్తోందని ఓ ఆంగ్ల మ్యాగజైన్ తెలిపింది. ఇందుకోసం వేల పౌండ్లు వసూలు చేస్తున్నారు. ముస్తాబు ఎక్కడ చేయించుకున్నా, ఎన్ని రంగులు అద్దుకున్నా ప్రేక్షకులు కనిపెట్టలేరా?

ప్రపంచంలోనే అత్యధికంగా సైకిళ్ళు గల మహా నగరంగా చైనాలోని షాంఘై వాసికెక్కింది. ఆ నగరంలో ప్రస్తుతం 90 లక్షల సైకిళ్ళు వీధుల్లో తిరుగుతున్నాయట. ఈ ఏడాది పది లక్షలు కొత్తగా చేరగా, వచ్చే ఏడాది వీధుల్లోకి వచ్చే 10 లక్షల సైకిళ్ళతో వీటి సంఖ్య కోటికి చేరుతుంది. రోడ్లపై వరదలా వచ్చిపడుతున్న సైకిళ్ళను నిరోధించడం ఎలా అని అధికారులు మథన పడుతున్నారట. చైనాలో పారిశ్రామిక నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న షాంఘై ప్రధాన వీధుల్లో కూడా కార్లు తిరగడానికి సాధ్యం కావడంలేదని ఫిర్యాదు. అందుకే వీధుల్లో పోటెత్తుతున్న సైకిళ్ళ సంఖ్యను వచ్చే ఏడాది తగ్గించడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నారు.

సైకిళ్ళ వరద

బిల్లుల వసూళ్ళకు బిఎస్ఎన్ఎల్ పాట్లు!

ప్రయివేటు ఫోన్ల కంపెనీల మోజుతో భారత్ సంచార్ నిగం లిమిటెట్‌ను పీకల్లోతు కష్టాల్లో ముంచిన పాలకుల చలువతో ఆ సంస్థ అధికారులు నానా పాట్లు పడుతున్నారు. బిఎస్ఎన్ఎల్‌కు బిల్లులు ఎగవేసి ప్రయివేటు ఫోన్లు తీసుకోవడం ఇటీవల ఎక్కువై పోయింది. పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో బిఎస్ఎన్ఎల్ బకాయిలు 8 కోట్ల రూపాయలు దాటి పోయాయి. వాటిని వసూలు చేసుకోవడానికి సంస్థ అధికారులు నడుం బిగించారు. తమ సిబ్బందిని ఇంటింటికి పంపించి పారు బకాయిలు వసూలు చేస్తున్నారు. దీని వల్ల ఇప్పటికి రెండు కోట్లు వసూలైందని వారు సంబరపడుతున్నారు. మిగిలిన బకాయిలు కూడా ఇలాగే వసూలు చేసుకోవాలని అనుకుంటున్నారట!

అర్ధరాత్రి మాత్రమే టీవీలు చూస్తున్న అమెరికా యువత!

ఇటీవల అమెరికాలోని యువతీ, యువకులు అర్ధరాత్రి దాటిన తర్వాత మాత్రమే టెలివిజన్లు చూస్తున్నారట! గతంలోలా రాత్రి పదకొండు గంటలకు టీవీలు కట్టివేయకుండా అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట నుండి తెల్లవారుజాము వరకు టీవీలకు అతుక్కుపోతున్నారట! 1999 నుండి 2003 వరకు జరిపిన ఒక సర్వేలో తెల్లవార్లూ టీవీలు చూసే 18 నుండి 34 సంవత్సరాల వయసు గల యువతీ యువకుల సంఖ్య 35 శాతం పెరిగిందట! ఇదే విధంగా ప్రైమ్‌టైమ్‌గా భావించే సమయంలో టీవీ చూసేవారి సంఖ్య 3 శాతం తగ్గిపోయిందట! ఇంగ్లీషు టీవీల్లో అర్ధరాత్రి వేళల్లో ఎటువంటి కార్యక్రమాలు ప్రసారం అవుతాయో అందరికీ తెలిసిందే కదా!

కా ర్టూ న్ క దం బం

అవినీతి
సుపరిపాలన కాదు
—బాబు పాలనపై

హైదరాబాద్
మళ్లీ గెలిపిస్తే పైపుల ద్వారా కృష్ణాజలాలు అందిస్తా
దేవేందర్
అధికారం ఇస్తే సింగూరు నుండి సాగునీరు కేటాయిస్తా
మెదక్
ఆజాద్


కాశ్మీర్‌లో శాంతి కోసం ప్లెబిసైట్ డిమాండ్ వదులుకుంటా
...ప్లెబిసైట్‌ను వదులుకోను


అధికారం
బోగస్ ఓటర్లు
కొత్త ఓటర్లు సార్ చేర్చుకోండి
ఇసి

కోటి ఆశలు రేకెత్తిస్తూ వస్తోంది

కొత్త సంవత్సరం

రోమన్ కేలెండర్ ప్రకారం ఇంకో రెండు రోజుల్లో కొత్త సంవత్సరం మన జీవితాల్లోకి ప్రవేశించబోతోంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో వివిధ సమయాల్లో నూతన సంవత్సర వేడుకలు జరుపు కుంటారు. మన దేశంలో కూడా... ఆంధ్రప్రదేశ్‌లో, చుట్టు పక్కల గల రాష్ట్రాల్లోనూ ఉగాది పండుగనే నూతన సంవత్సరాదిగా భావిస్తారు. ఆ తేదీల్లో మరలా రాష్ట్రాల నడుమ తేడాలు. ఇలా ఎన్నో దేశాల్లో నూతన సంవత్సర వేడుకలు వేర్వేరుగా జరుపుకుంటారు. ప్రతిదేశంలోనూ వేర్వేరు కేలెండర్లు ఉన్నప్పటికీ రోమన్ కేలెండర్‌నే ఈ రోజున ప్రపంచమంతటా అనుసరిస్తున్నారు. మనదేశంలో కూడా ప్రతి రాష్ట్రానికి ఉగాది ఉన్నా నూతన సంవత్సరం అంటే జనవరి ఒకటో తేదీ మాత్రమే...

గడిచిన సంవత్సరం బాగాలేదని కొత్త సంవత్సరంలో భవిష్యత్ ఎంతో బాగుంటుందని ఆశతో ఎదురు చూస్తూ విశ్వవ్యాప్తంగా మానవాళి నూతన సంవత్సరానికి ఆహ్వానాన్ని పలుకుతుంది. ఒకప్పుడు నూతన సంవత్సర వేడుకలంటే మనదేశంలో చాలా సాధారణంగా జరిగేవి. వర్తమాన పరిస్థితుల్లో ప్రపంచీకరణ, పాశ్చాత్య నాగరికత ప్రభావంతో నూతన సంవత్సర వేడుకలు ఎంతో ఆర్భాటంగా జరుపుకునే వారు ఎక్కువయ్యారు. ఆర్థిక పరిస్థితులను బట్టి వేడుకల ఘనత ఆధారపడి ఉంటుంది. కొత్త సంవత్సరంలో అడుగుపెట్టబోయే ముందు వివిధ దేశాల్లో ఈ వేడుకల గురించి తెలుసుకుందాం..

నూతన సంవత్సర వేడుకలకు ఆద్యులెవరన్నది పరిశీలిస్తే.... ఇందుకు మనం 4000 సంవత్సరాలు వెనక్కు వెళ్లాల్సిందే. క్రీ.పూ 2000 సంవత్సరం సెప్టెంబర్ చివరిలో ఈజిప్ట్‌లో నైలు నదికి వరదలు వచ్చాయి. ఈ వరదల్లో కొట్టుకు వచ్చిన ఒండ్రుమట్టితో భూములన్నీ సారవంతమయ్యాయి. దీనితో వచ్చే సంవత్సరం పంటలు పండించేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. దీనినే వారు నూతన సంవత్సర ఆరంభానికి చిహ్నంగా భావించారు. ఇది ఈజిప్ట్ వారి న్యూ ఇయర్స్ డే! ఇక బాబిలోనియాలో వసంత రుతువు ప్రారంభం రోజునే కొత్త సంవత్సర ఆరంభానికి సంకేతంగా భావిస్తారు. ఈ వేడుకలను 11 రోజుల పాటు జరుపుకుంటారు. ఇందులో ప్రతి రోజుకూ ఓ ప్రత్యేకత వుండటం విశేషం. ఈ సంప్రదాయాన్నే ప్రస్తుతం మనం అనుసరిస్తున్నాం. అదే మన తెలుగు ఉగాది వసంత రుతువు ప్రారంభం రోజే కదా! బాబిలోనియా స్టైలులోనే వసంత నవరాత్రులను తొమ్మిది రోజుల పాటు నిర్వహించుకుంటుంటాం.

కొన్ని దేశాల్లో సెప్టెంబర్‌లో, మరికొన్ని దేశాల్లో మార్చిలో నూతన సంవత్సరం ప్రారంభం అవుతుంది. రోమన్‌లకు కూడా ఈ సంప్రదాయమే వుండేది. వారు కూడా మార్చి చివరిలోనే కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేవారు. అయితే వారికి చక్రవర్తి మారినప్పుడల్లా కేలండర్ మారిపోతుండేది. దీనిని సరిచేయాలన్న ఉద్దేశంతోనే క్రీ.పూ 153లో రోమన్ సెనేట్ జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినంగా ప్రకటించింది. అయితే అప్పుడు దీనిని గురించి పట్టించుకున్న నాథుడే లేడు. అప్పటి వరకు 445 రోజుల కాలాన్ని సంవత్సరంగా పరిగణించేవారు. క్రీ.పూ46లో రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ దీనిని సంస్కరించేందుకు పూనుకున్నాడు. ఆయన అప్పుడు ప్రకటించిన 365 రోజుల కేలండర్‌నే ఇప్పుడు మనం అనుసరిస్తున్నాం. సూర్యుని గమనాన్ని అనుసరించే ఈ కేలండర్‌కి ప్రారంభ దినంగా జనవరి 1నే సీజర్ ఖరారు చేశాడు. తాము ఆరాధించే రెండు తలల దేవత జానస్ పేరిట జనవరి నెలను కొత్త సంవత్సరానికి ఆరంభ సంకేతంగా ఎంచుకున్నారు. జానస్ దేవత తన రెండు తలలలో ఒక దానితో ముందుకు మరో దానితో వెనక్కు చూస్తూ వుండే వాడు. పాతను గతంలో కలిపేసి కొత్తను ఆహ్వానించటానికి గుర్తుగా కొత్త సంవత్సర ఆరంభాన్ని జానస్ సంకేతంతో జనవరి నెలగా వ్యవహరించేవారు.

గ్రీకులు చిన్న పిల్లవాడిని ఒక బుట్టలో పెట్టి పురవీధుల్లో ప్రదర్శించే వారు. క్రైస్తవ పౌరులు ఈ సంప్రదాయాన్నే స్వీకరించుకుని కాలగర్భంలో కలిసిపోయే పాత సంవత్సరాన్ని వయో వృద్ధునితోనూ కొత్త సంవత్సరాన్ని చిన్న పిల్లవానితోనూ పోల్చటం ప్రారంభించారు. ఇప్పటికీ ఇదే విధానం ప్రపంచంలోని పలు దేశాల్లో అమల్లో వుంది. కొత్త సంవత్సరాన్ని స్వాగతించటంలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో వివిధ పద్ధతులు అనుసరిస్తున్నారు.

జపనీయులు తమ ఇళ్ళముందు ఒక తాడును కడతారు. ఈ తాడు తమను దుష్టశక్తుల నుండి దూరంగా వుంచి అదృష్టాన్ని ప్రసాదిస్తుందని వారి విశ్వాసం. సంవత్సరం అంతా సుఖశాంతులతో గడిచిపోవాలని కోరుకుంటూ నవ్వులతో కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తారు.

చైనాలో చలికాలంలో రెండవ మాసం చంద్రోదయం రోజున నూతన సంవత్సరం ఆరంభదినంగా పరిగణిస్తారు. సాధారణంగా ఇది జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభం అవుతుంది. ఈ సందర్భంగా తొమ్మిది రోజులపాటు సెలవులిస్తారు. ఈ కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి ఆనందంగా గడిపేందుకు ప్రయత్నిస్తారు. ఒకరి అనుభవాలను ఒకరు పంచుకుని భవిష్యత్ ప్రణాళికల

యునిసెఫ్ ముద్రించిన తొలి గ్రీటింగ్ కార్డు

చిట్టి చేతుల సంచలనం

యునిసెఫ్ గ్రీటింగ్స్

క్రిస్టమస్, నూతన సంవత్సరం వస్తున్నదంటేనే మార్కెట్‌లో గ్రీటింగ్ కార్డుల సందడి మొదలవుతుంది. ఈ గ్రీటింగ్ కార్డులకు 200 ఏళ్ళకు పైగా చరిత్ర ఉంది. 1800 సంవత్సరంలో పశ్చిమ దేశాలకు చెందిన 'వాలెంటేనర్' అనే ఆసామి తొలిసారిగా గ్రీటింగ్ కార్డును రూపొందించినట్లు చెబుతారు. అయితే తొలి క్రిస్మస్ కార్డును 1843లో జెరూసలేం నివాసి జె.సి.హార్స్లీ తయారు చేశారు. కానీ వాణిజ్య మార్కెట్‌లోకి ఈ గ్రీటింగ్ కార్డులు 1847లో ప్రవేశించాయి. మొదట స్నేహ సంబంధాలను పదిలం చేసుకోవడానికి పరస్పరం అందజేసుకునే ఈ గ్రీటింగ్ కార్డుల సంస్కృతి కాలక్రమంగా సేవా కార్యక్రమాల విస్తరణకు, విరాళాల సేకరణకు కూడా వినియోగమవుతున్నది. ఇలాంటి వాటిలో అంతర్జాతీయ బాలల నిధి (యునిసెఫ్) గ్రీటింగ్ కార్డులది ప్రత్యేక స్థానం.

1946లో యూరప్‌లో యుద్ధ పీడితులైన బాలబాలికల సంక్షేమం కోసం యునిసెఫ్ అవతరించింది. 1949లో జెకోస్లవేకియాకు చెందిన 'జిట్కా' అనే ఏడేళ్ళ బాలిక 'దిలైన్ ఆఫ్ చిల్డ్రన్ నీడింగ్ హెల్ప్ ఈజ్ ఎండ్‌లెస్' అనే టైటిల్‌తో వేసిన పెయింటింగ్‌ను యునిసెఫ్ వారికి పంపింది. ఈ బొమ్మలోని భావాన్ని అర్థం చేసుకున్న వారు గ్రీటింగ్ కార్డులను యునిసెఫ్ పక్షాన ముద్రించాలనుకున్నారు. అలా జిట్కా చేసిన చిన్న ప్రయత్నమే యునిసెఫ్ కార్డుల ముద్రణకు నాంది పలికింది.

'జిట్కా సమకోవా' అనే పూర్తి పేరు గల ఈ చిన్నారి రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో తమ గ్రామ ప్రజలకు ప్రాణనష్టం వాటిల్లకుండా కాపాడిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ తనకుతోచినట్లుగా వేసిన చిత్రాన్ని చూసిన టీచర్ 'జోసెఫ్ ఎ బర్డోష్కా' ముచ్చటపడి తన బడి పిల్లలే వేసిన మరో 8 చిత్రాలతో కలిపి యునిసెఫ్ వారికి పంపింది. వాటిలో 'జిట్కా' వేసిన బొమ్మను ఎంపిక చేసి తమ సంస్థ ఇండోర్ కాలండర్ బొమ్మగా ముద్రించి దేశంలోని తమ కార్యాలయాలన్నిటిలోనూ వేలాడదీశారు. ఇది తెలుసుకున్న న్యూయార్క్ యునిసెఫ్ కార్యాలయం వారు 1949లో జిట్కా బొమ్మను గ్రీటింగ్ కార్డుగా ముద్రించి తమ కార్యాలయ సిబ్బందికి మాత్రం అందుబాటులో ఉండేలా అమ్మకాలు చేశారు.

విడుదలైన తొలిరోజే ఈ కార్డులన్నీ అమ్ముడయ్యాయి. దాంతో యునిసెఫ్ డైరెక్టర్‌పై గ్రీటింగ్ కార్డుల ముద్రణకు ఒత్తిడి పెరిగింది. ఆయన 1957లో వీటి ముద్రణకై నాలుగువేల డాలర్లు కేటాయించి లక్షా అరవై వేల కార్డులను ముద్రించారు. అవి అమ్మగా 16,274 డాలర్ల ఆదాయం వచ్చింది. అలా హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్న గ్రీటింగ్ కార్డుల ముద్రణకు 1952లో ప్రత్యేక డైరెక్టర్‌గా 'నోరా ఎడ్మండ్స్'ని నియమించారు. కాలక్రమంలో దేశదేశాల ప్రసిద్ధ చిత్రకారుల పెయింటింగ్స్‌ని గ్రీటింగ్ కార్డులపై ముద్రించడం ప్రారంభించారు. ఈ యునిసెఫ్ గ్రీటింగ్ కార్డులపై ముద్రించే చిత్రాల ఎంపిక విభిన్నంగా ఉంటుంది. మొదటి సంవత్సరం జూన్‌లో "యునిసెఫ్ ఆర్ట్ సెలక్షన్ కమిటీ"కి అంతర్జాతీయ చిత్రకారులు తమ చిత్రాలను అందజేస్తారు. వీటి ఎంపికలో యునిసెఫ్ బాలల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాల అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఎంపికైన చిత్రాలు గ్రీటింగ్ కార్డుల కెక్కడానికి రెండేళ్ళు పడుతుంది.

మూడవ సంవత్సరంలో ముద్రించి ప్రపంచ వ్యాప్తంగా నూటనలభై దేశాల్లో విక్రయిస్తారు. వాటిని



గురించి చర్చించుకుంటారు. కొత్త దుస్తులు ధరిస్తారు. గృహాలను ప్రత్యేకంగా దీపాలతో అలంకరించుకుంటారు. ఈ దీపాల వెలుగు తమ జీవితాల్లో బంగారు కాంతులు నింపుతుందని వారు విశ్వసిస్తారు.

వియత్నాంలో కొత్త సంవత్సరం ప్రారంభాన్ని టెట్ గ్యాయెన్‌డాన్‌గా పిలుస్తారు. దీన్నే టెట్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా జనవరి 21 ఫిబ్రవరి 19ల మధ్య కొత్త సంవత్సరాది వస్తుంటుంది. నూతన సంవత్సరంలో తన ఇంటిలోకి ప్రవేశించే మనిషితోనే తన అదృష్టమైనా, దురదృష్టమైనా ముడిపడి వుంటుందన్నది ఓ సామాన్య వియత్నాం పౌరుడి దృఢ విశ్వాసం. అలాగే నూతన సంవత్సరారంభంలో స్వర్గం నుండి దేవుడు దిగివచ్చి తమను ఆశీర్వదిస్తాడని వారు విశ్వసిస్తారు.

కంబోడియా ప్రజలు భారతీయ కేలండర్‌నే అనుసరిస్తారు. ఈ నూతన సంవత్సర వేడుకలు ఏప్రిల్ 12,13,14 తేదీల్లో ప్రారంభమవుతాయి. బుద్ధుడి విగ్రహాన్ని పూలు, పండ్లు, పత్రాలు, పానీయాల వంటి వాటితో భక్తిగా ఆరాధిస్తారు. తరువాత సమీపంలోని దేవాలయాలకు వెళ్ళి అక్కడ ఉన్న సాధువులకు ఆహారాన్ని దానం చేస్తారు. ఇక యువకులు, పిల్లలు ఆటలకే ప్రాధాన్యతనిస్తారు. వీరు ఆడే ముఖ్యమైన ఆట టగ్ ఆఫ్ వార్. ఇందులో గెలిస్తే సంవత్సరం అంతటా తమకు విజయం లభిస్తుందని వారి నమ్మకం.

భారత దేశంలో నూతన సంవత్సర వేడుకలను విభిన్న సంప్రదాయాల్లో నిర్వహిస్తుంటారు. తెలుగు వారు చైత్ర మాసం (వసంత రుతువు) ఆరంభాన్ని నూతన సంవత్సరాదిగా వ్యవహరిస్తుంటారు. ఈ సందర్భంగా అన్ని రుచులతో కూడిన ఉగాది పచ్చడిని రుచి చూడని ఆంధ్రుడు ఉండడంటే అతిశయోక్తి

పాత కొత్తల కలయిక

ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మూడు భాషల్లో అచ్చువేస్తారు.

ఈ యునిసెఫ్ వారి గ్రీటింగ్ కార్డులపై స్త్రీ, శిశు సంక్షేమం, కుటుంబం, పిల్లలు, వారి అభివృద్ధి, అక్షరాస్యత, ప్రపంచ శాంతి, మైత్రీభావం, పర్యావరణం, సాంస్కృతిక వారసత్వం, మెరుగైన జీవితానికి తోడ్పడే వాతావరణం, యువతరం, [illegible], పర్వదినాలు, నూతన సంవత్సర [illegible] వంటి విభిన్నమైన అంశాలు చోటు [illegible]. 1999లో 150 మిలియన్‌ల వరకు [illegible] కార్డులు అమ్ముడుపోయాయి. అదే సంవత్సరం మన దేశంలో 3 లక్షల 45 వేల డాలర్ల ఆదాయం లభించింది. మన దేశానికి చెందిన [illegible], జెమినీ రాయ్, భగవాన్ కపూర్, సుల్తాన్ అలీ, మౌలాలంకర్, ఎం.ఎఫ్.హుస్సేన్ వంటి ప్రసిద్ధ చిత్రకారుల పెయింటింగ్స్ ఈ కార్డులపై ముద్రించారు. వీటి అమ్మకాలతో వచ్చిన ఆదాయాన్ని బాలల సంక్షేమానికి వినియోగిస్తారు. వాటి అమ్మకాల్లో భారతదేశం 6వ స్థానంలో ఉంది. మన దేశానికి అమర్‌నాథ్ సెహగల్ "ఫ్లూట్‌ప్లేయర్" చిత్రం న్యూయార్క్ యునిసెఫ్ కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రదర్శించడం భారతీయులందరికీ గర్వకారణం.

ఒక చిన్నారి పాప పంపిన చిత్రసందేశం గ్రీటింగ్ కార్డుల చరిత్రనే మార్చివేసింది. ఆమె కృతజ్ఞతలు చెప్పుకున్న తీరు వ్యాపార ప్రపంచాన్ని కుదిపివేసింది. 150 దేశాల నుండి 2600 మంది చిత్రకారులు తమ చిత్రాలను ముద్రించేందుకు హక్కులు ఇచ్చారు. వారిలో పికాసో, సెల్వాడర్ అలా, మార్క్ ఛాగల్, జార్జియా ఒకెఫ్, మాండ్రుబెట్ వంటి వారున్నారు. 55 ఏళ్ల క్రితం చిట్టి చేతుల సంచలనం "యునిసెఫ్ గ్రీటింగ్ కార్డులు"గా రూపొంది, మైత్రీ సందేశకులుగా నిర్వహిస్తున్న పాత్ర సామాజిక ప్రయోజనకరంగా ఉంది.

- హెచ్.రమేష్‌బాబు

కాదేమో. భవిష్యత్తును తెలిపే పంచాంగ శ్రవణం వినటం, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయటం వంటివి తెలుగువారి సంప్రదాయంగా చెప్పుకోవచ్చు. ఉత్తర భారత దేశంలో నూతన సంవత్సర వేడుకలను పుష్పాలంకరణతో జరుపుకుంటారు. ఎక్కువగా ఐశ్వర్యాధిదేవత అయిన లక్ష్మీదేవిని ఆరాధించి తమకు ఐశ్వర్యంతో పాటు సుఖశాంతులు కలుగచేయమని ప్రార్థిస్తారు.

సాధారణంగా పింక్, ఎరుపు, పర్పుల్, తెలుపు వంటి రంగుల పూలతో అలంకరించుకుంటుంటారు. పాశ్చాత్య దేశాల శైలిని అనుసరించే ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ప్రస్తుతానికి పట్టణాలు, నగరాలలో ఉన్నత కుటుంబీకులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు పరిమితం అయిపోయాయి. గతంలో గ్రీటింగ్ కార్డుల ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసే వారు. ఇప్పుడు మొబైల్ విప్లవం వచ్చిన తరువాత ప్రతివారూ తమ సన్నిహితులకు ఫోన్ ద్వారా, ఎస్ ఎం ఎస్‌ల ద్వారా గ్రీటింగ్స్ తెలియచేయటం ప్రారంభించారు. ఇక నగరాల్లో డిసెంబర్ 31 రాత్రి డాన్స్ పార్టీలు, కాక్‌టెయిల్ పార్టీల సందడి సరేసరి!

ఇక ముస్లిం సోదరులకు నూతన సంవత్సరం సాధారణంగా మార్చి నెలలో ప్రారంభం అవుతుంది. వారి కాలమానం (కేలండర్) అంతా చంద్రగమనం ఆధారంగా వుంటుంది. ఇరాన్‌లో ముస్లింలు చిన్న చిన్న పాత్రల్లో గోధుమ, బార్లీ వంటి ధాన్యపు గింజలను నానబెట్టి ఉంచుతారు. కొత్త సంవత్సరారంభంలో మొలకెత్తే ఈ మొక్కల్లాగే తమ జీవితాలు కూడా దినదిన ప్రవర్ధమానమవుతాయని వారి నమ్మకం.

యూదులు తమ కొత్త సంవత్సర ఆరంభ దినాన్ని రోష్‌హసన్నా అని వ్యవహరిస్తారు. సాధారణంగా ఇది సంవత్సరంలో ఏడో నెల లేదా తిశ్రి మాసంలో వస్తుంది. గతంలో జరిగిన తప్పులేవైనా వుంటే అవి సరిదిద్దుకుని కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాలని ఈ సందర్భంగా నిర్ణయాలు తీసుకుంటారు. బంధు మిత్రులకు పండ్లు పంచుతూ శుభాకాంక్షలు తెలియచేస్తారు.

నూతన సంవత్సర ఆరంభ వేడుకల్లో పాశ్చాత్యుల తీరే వేరు. అమెరికాలో కొత్త సంవత్సరం ఆరంభం రోజున ప్రదర్శనలు నిర్వహిస్తారు. క్రీడా ప్రియులు ఫుట్‌బాల్ ఆటలో కాలం గడుపుతారు. అనేక మంది అర్ధరాత్రి వరకు పార్టీల్లో గడుపుతారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవటం విశేషం. కొత్త సంవత్సరం ఆరంభ ఘడియల్లో కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులందరికీ పేరు పేరునా శుభాకాంక్షలు తెలియచేస్తారు. ఇంక ఈ హడావుడి అంతా పూర్తయిన తరువాత అప్పుడు కొత్త సంవత్సరం ఏమేం చేయాలన్న విషయాలపై తీర్మానాలు చేసుకుంటారు.

యూరప్ దేశాల్లో ఎక్కువగా నూతన సంవత్సరం అదృష్టం తెస్తుందని విశ్వసిస్తారు.



స్విట్జర్లాండ్, ఆస్ట్రియా వంటి దేశాల్లో ప్రజలు కొత్త దుస్తులు ధరించి సెయింట్ సిల్వెస్టర్ ఈవ్‌గా ఈ వేడుకలను నిర్వహిస్తారు. గ్రీస్‌లో న్యూ ఇయర్స్ డేని సెయింట్ బాసిల్ పండుగగా నిర్వహిస్తారు. ఈ రోజున గ్రీకులంతా పరస్పరం బహుమతులతో శుభాకాంక్షలు తెలుపుకుంటారు. స్కాట్‌లాండ్‌లో హోగ్‌మానే అనే పేరుతో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తారు. ఇక్కడ కొన్ని గ్రామాల్లో తారు పీపాలను వెలిగించి రోడ్లపై దొర్లిస్తారు. ఆ మంటల్లో పాత సంవత్సరం దగ్ధమై కొత్త సంవత్సరం స్వేచ్ఛగా ప్రవేశిస్తుందని వారి నమ్మకం. ఇక ఫస్ట్ ఫుటింగ్ పేరుతో నూతన సంవత్సరారంభం రోజున తమ ఇంటికి వచ్చే తొలి వ్యక్తి తమకు అదృష్టాన్ని లేదా దురదృష్టాన్ని తెస్తాడని నమ్ముతారు. దట్టమైన కేశ సంపద కలిగిన వ్యక్తి తమకు బహుమతి తీసుకువస్తే ఇక ఆ ఏడాదంతా తమకు అదృష్టయోగమేనన్నది కొందరి విశ్వాసం.

ఉభయ కొరియాల్లో ఒక వింత ఆచారం అమల్లో వుంది. నూతన సంవత్సర ప్రారంభ దినాన ఉదయిస్తున్న సూర్యుడిని చూస్తే ఆ సంవత్సరం అంతా తమకు మంచే జరుగుతుందని అక్కడి వారు భావిస్తారు. తూర్పు ప్రాంతంలోని కొరియన్లంతా సూర్యోదయానికి ముందే సముద్ర తీరానికి చేరుకుని ఆనందంగా గడుపుతారు.

వింత ఆచారాలు

స్పెయిన్‌లో నూతన సంవత్సర వేడుకల్లో ఆమ్లెట్ తప్పనిసరిగా వుంటుంది. అయితే దీని రూటే సెపరేటని అక్కడి వారి ఉవాచ. కోడిగుడ్లు, బంగాళా దుంపలు, ఉల్లిపాయ, కేక్ ముక్కలతో తయారు చేసే ఈ వెరయిటీ ఆమ్లెట్ చాలా రుచిగా వుంటుందట. సాధారణంగా స్పెయిన్ బార్లు, రెస్టారెంట్లు ఈ రకం ఆమ్లెట్లు తయారు చేస్తున్నప్పటికీ జనవరి ఫస్ట్ ఆమ్లెట్ ప్రత్యేకతే వేరు.

జర్మనీలో సాధారణంగా ఔట్‌డోర్ పార్టీలకే ప్రాధాన్యతనిస్తుంటారు. నూతన సంవత్సర వేడుకలను ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో మరింత ఘనంగా జరుపుకుంటారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ తాజా శ్వాసతో ఔట్‌డోర్ పార్టీలతో ఆనందంగా గడిపేస్తారు.

బ్రెజిల్‌లో కొత్త సంవత్సర ఆరంభ దినాన అంతా ధవళ వస్త్ర ధారులవుతారు. అంటే తెల్లటి దుస్తులు ధరిస్తారు. దగ్గరి ప్రాంతాల్లో ఉన్నవారు అర్ధరాత్రి సమయానికల్లా బీచ్‌కి చేరుకుంటారు. స్నాన సమయంలో ఏడు అలలు తమను తాకే వరకు నీటిలో వుండి తరువాత పూలను నీటిలోకి విసిరి ప్రార్థనలు జరుపుతారు.

నూతన సంవత్సర వేడుకలు ఏ దేశంలో ఏవిధంగా జరుపుకుంటున్నా అందరి ఆశా, ఆశయం ఒకటే. కనీసం రాబోయే సంవత్సరంలో నైనా సుఖ, సంతోషాలతో జీవించాలన్నదే అందరి ఆశయం. కొత్త సంవత్సరంలో ఈ ఆశ నెరవేరుతుందని ఆశిద్దాం. ●



✻ శ్రీ చరణ్‌మిత్ర

మూడో చేప కథ

ఇది మీకందరకూ కొంతవరకూ తెలిసిన కథే.

ఒకప్పుడు ఒక కొలనులో మూడు చేపలు వుండేవి. సుమతి, కాలమతి, మందమతి అనే పేర్లు గల ఆ మూడు చేపలూ చాలా స్నేహంగా ఉంటూ మడుగులో జీవనం సాగించేవి. కానీ కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! ఐదేళ్ళకోసారి మన నాయకులు వాగ్దానాలతో వచ్చినట్లు, గేలాలు పట్టుకుని కొందరు జాలర్లు అటుపక్క వచ్చారు. 'ఒక వారం పది రోజుల్లో ఈ చెరువులో ప్రవాహ వేగం తగ్గిపోతుంది. అప్పుడు మనం చాలా సులువుగా చేపల్ని పట్టి బుట్టలో వేసుకోవచ్చు' అన్న ఒక జాలరి మాటలు మూడు చేపలూ విన్నాయి. దీంతో వాటికి బ్రతుకు భయం పట్టుకుంది.

"మనం వెంటనే తప్పించుకు వెళ్ళిపోవడం మంచిది. ఈ కాలువ గుండా వెళితే వేరొక మడుగు ఏదొకటి తగులుతుంది. అక్కడ మనం సుఖంగా బ్రతకవచ్చు" అంది సుమతి.

"ఆ సమయం వచ్చినపుడు తెలివిగా తప్పించుకోవచ్చు. ఇప్పటి నుండే భయపడటం ఎందుకు?" అంది కాలమతి.

"మనం ఎవరికీ చెడు చేయలేదు. ఆ భగవంతుడు మనకు మంచే చేస్తాడు. ఎలాంటి అపాయం రాదనే నా నమ్మకం" అంది మందమతి.

అయితే సుమతి మాత్రం ముందే ప్రవాహవేగంలో నుండి పిల్లకాలువ గుండా సురక్షితంగా తప్పించుకుంది. కొంతకాలానికి కాలమతి, మందమతి జాలరి వలలో పడ్డాయి.

గేలానికి పడిన కాలమతి ముందే చచ్చినట్లు నటించింది. చచ్చిందనుకుని కాలమతిని నిర్లక్ష్యంగా ఒడ్డున పడేసి మళ్ళీ చేపలు పట్టడానికి మడుగులో దిగిన మరుక్షణం కాలమతి నెమ్మదిగా నీటిలోకి జారి ఎలాగో తప్పించుకుంది.

పాపం మందమంతి మాత్రం గేలం నుండి బుట్టలోకి చేరి అనేక విగత చేపల మధ్య విలవిలలాడుతూ – "ఓ సృష్టికర్తా! నిన్నే నమ్ముకున్న నాకు ఇలాంటి దుర్భరత్వాన్ని ఎందుకు ప్రసాదించావయ్యా. నిత్యం చావు బతుకుల మధ్య భయంతో గడిపే జీవులుగా బతికాం. చివరకు చావు కూడా ఇలా ఇవ్వడం ఏం న్యాయం స్వామీ" అంటూ ప్రార్థించసాగింది.

ఏ మూడ్‌లో ఉన్నాడో తెలీదు గానీ దేవుడు ఆ చేపకు మాత్రమే దర్శనం ఇస్తూ – "ఏం చేయను మందమతీ, కర్మశేషం అనుభవించక తప్పదు. ఎన్ని జన్మలెత్తినా 'కర్మ' ప్రొసీజరును మీరు ఫాలో కాక తప్పదు" అన్నాడు.

"అదేమిటి కరుణాపరేణ్యా, నీవు మానవ పక్షపాతివి. వాళ్ళయితే నీకు పూజలు, అభిషేకాలు చేస్తారని వాళ్ళకు ఆర్తత్రాణ పరాయణుడవు అయి, అల్పప్రాణులైన మమ్మల్ని చిన్న చూపు చూస్తావు" అని అనగలిగింది ప్రాణం కడగట్టిపోతుండగా.

"లేదు. నాకందరూ సమానమే... అయినా చివరి సమయంలో ప్రార్థించావు. కనుక ఏదైనా వరం కోరుకో" అన్నాడు దేవుడు.

"ఏముంది స్వామి? చేపలుగా పుట్టి నేనూ నా స్నేహితులు దినదినగండంగా బతికాం. మళ్ళీ ముగ్గురం మానవులుగా పుట్టేట్లు అనుగ్రహించు"

"అలాగే... అయితే అపుడు కూడా నా అంశలో పాలకులు ఉంటారు. మీ చేపల అంశలో మీరు మామూలు పౌరులుగా ఉంటారు. స్థితి మాత్రం కంటిన్యూ అవుతుంది. ఇష్టమేనా?" అనడిగాడు దేవుడు. అప్పటికే శ్వాస ఆడని ఆ చేప 'సరే' అన్నట్లుగా బుర్ర ఊపింది. అలవాటుగా దేవుడు 'తథాస్తు' అనేశాడు.

* * *

కాలేజీ చదువులు ఎలాగోలా పూర్తి చేశాం. ఇక పై చదువులు చదవడానికి ముగ్గురికీ అవకాశం లేదు. కనుక మనం ఇకపై ఉదర పోషణార్థం ఏదొక పనుల్లో స్థిరపడాలి" అన్నాడు శ్రీధర్.

"సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ కింద లోన్ తీసుకుంటే, ఏదొక వ్యాపారం చేసుకోవచ్చు. మన ప్రభుత్వాలు ఏటా కొన్ని వందల స్కీములు ప్రకటిస్తున్నాయి కదా" అన్నాడు వామనరావు.

"అయినా నిరుద్యోగం బాగా పెరిగిపోతోంది. స్కీములు, లోనులు వచ్చేవి మనలాంటోళ్ళకి కావు. వాటికి రకరకాల పైరవీలు చెయ్యాలి. మనకూ, మన కుటుంబాలకూ అలాంటివి ఎలానూ చేతగావు కనుక మరో మాట ఏదైనా చెప్పండి" అన్నాడు శ్రీధరం.

"వెధవ బోడి బియ్యేకు వ్యాపారం ఏం చేయగలం? అప్పట్లో బియస్సీ, బికామ్‌లలో సీట్లు రాక బి.ఏ.లో ఏడిశాం. సామాజిక శాస్త్రాలు శుద్ధ దండగని ఇప్పటి పెద్దలు మనం ఆ చదువులు మనం వెలగబెట్టాక చెబుతున్నారు" నిరాసక్తంగా అన్నాడు వామనరావు.

"ఫరవాలేదు బాధపడకు. అందుకే నేతలు

కొందరు అందరికీ ఉద్యోగాలంటే ప్రభుత్వాలు ఎక్కడ నుండి తెస్తాయి? స్వయం ఉపాధి మీద యువత అవగాహన ఏర్పరుచుకోవాలి అని చెబుతున్నారు.

"అందుకే నేనొక నిర్ణయానికి వచ్చాను" అన్నాడు శ్రీధరం స్థిర కంఠంతో

ఏమిటన్నట్టు చూశారు మిగతా ఇద్దరూ.

"మా నాన్నగారు చేస్తున్న భూతవైద్యం చేసుకుని బ్రతుకుతాను" చెప్పాడు శ్రీధరం.

"ఛీ... చదువుకున్న నీవు కూడా మూఢ నమ్మకాలను ప్రోత్సహిస్తూ భూతవైద్యాలు చేస్తాననడానికి సిగ్గుగా లేదూ" అడిగాడు సత్యం.

"మరేమిటి చేయడం? ఈ సమాజంలో బతకడానికి అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునే లౌక్యం... ఎదుటివారిని కొల్లగొట్టగలిగే దౌర్జన్యం ఉంటేనే... మనం ధనికులుగా ఉండగలం. నేను ఇలానే బతకాలనుకుంటున్నాను" అన్నాడు దృఢ సంకల్పంతో శ్రీధరం.

ఆ తరువాత మిగతా స్నేహితులిద్దరూ ఎంత నచ్చచెప్పినా వినకుండా వాళ్ళ నాన్నగారి వారసత్వంతో లభించిన భూతవైద్యంలో స్థిరపడిపోయాడు.

మానవ జీవితంలో ఎంతోకొంత బలహీనతలు, అమాయకత్వాలు సహజం కనుక అటు పూర్తి పట్టణమూ కాక అలా అని పల్లె నాగరికత వదలని ఆ గ్రామంలో అమాయకులతో సొమ్ము చేసుకునే శ్రీధరం ధనికులలో తాను ఒక్కడై దర్జాగా బతకసాగేడు.

మిగతా మిత్రులిద్దరూ ఒక నాలుగైదు సంవత్సరాల వరకూ చిన్నా, చితక పనులు చేస్తూ... ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ల కోసం చూస్తూ– అప్పుడప్పుడు ఇంటర్వ్యూలకు ఎటెండ్ అవుతూ ఏ ఉద్యోగం రాక ఉసూరంటున్న టైంలో – వామనమూర్తి మావయ్య ఒకడు రాజకీయాలలో దిగుతున్నాడని తెలిసింది. అతను ఎమ్మెల్యేగా ఒక ప్రముఖ పార్టీ తరపున పోటీ చేస్తున్నాడు.

ఈ అవకాశాన్ని వినియోగించదలుచుకున్నాడు వామనరావు.

"నా దరిద్రం తీరే రోజులు వచ్చినయ్. మా మావయ్య పాలిటిక్స్‌లో అడుగు పెడుతున్నాడు. దేవుడు దయతలచి ఎమ్మెల్యే సీటు దక్కితే మంత్రి అయ్యే సూచనలు మా మావయ్యకే ఎక్కువ ఉన్నాయట. ఆయన రికమండేషన్‌తో ఏదొక ఉద్యోగం దొరక్కపోదు. అందాక ఆయనకు కుడి భుజంలా ఉండాలి" అన్నాడు త్రి'కాలజ్ఞాని'లా

"అదేమిట్రా మీ మావయ్య పిల్లికి బిచ్చం పెట్టడని మొన్నటి వరకూ అంటుండేవాడివి కదా... ఇపుడాయనకు సేవ చేస్తానంటావేమిటి?" అన్నాడు సత్యం చిరాగ్గా.

"అది ఆయన నైజం. అధికారం వున్నవాడికి సేవచేయడం వలన మనకు లాభం ఉంటుంది. అవకాశం ఉంటే ఉద్యోగం.. లేదంటే నేనూ రాజకీయాల్లో చేరిపోతాను" అన్నాడు స్థిరకంఠంతో.

"అదేమిట్రా... రాజకీయ పైరవీలు అవీ చేసుకునే ఖర్మ మనకేమిటి? మనం డిగ్రీ పాసయ్యాం. ఎంప్లాయిమెంట్‌లో రిజిస్ట్రేషన్ చేయించాం. అంతో, ఇంతో సీనియార్టీ ఉంది. ఎలక్షన్ల ముందు ఉద్యోగాల నోటిఫికేషన్లు, జి.ఓ.లు తయారవుతాయి. మనకు ఏదొక ఉద్యోగం రాకపోదు" అన్నాడు సత్యం.

"ఎంప్లాయిమెంట్ నుండి ఉద్యోగాలా? నీవు 'మందమతి'లా ఉన్నావు. ఎన్టీరామారావు బ్రతికి ఉన్నకాలంలో వేసిన ఎంప్లాయిమెంటు బ్యాన్ ఆయన అల్లుడు పాలించిన అష్టమ సంవత్సరంలో కూడా ఎత్తలేదు. మనం ఎలాగోలా ఏదొక పని చేసుకోవడమే తప్ప మరో మార్గం లేదు" అంటూ వామనుడు ఎలాగైనా టైం వస్తే త్రివిక్రముడై పోవాలనే భావనతో నెమ్మదిగా రాజకీయాల్లోకి కార్యకర్తగా చొరబడి, వామనమూర్తి లేనిదే వార్డులో ఏ పనీ జరగదు అన్నట్టుగా తయారయ్యాడు. మందుపోసి ఓట్లు వేయించుకోవడంలోనూ... అవతలి పార్టీల వారిని అతలా కుతలం చేయడంలోనూ ఆరితేరిపోయాడు.

అయితే సత్యమూర్తి మాత్రం... చకోర పక్షిలా మంచిరోజుల కోసం ఎదురు చూస్తూ.. చూస్తూ వివిధ ప్రయివేటు పనులు చేస్తూ... ప్రయివేటు యజమానుల నిరంకుశ ధోరణికి గురవుతూ, రోజుకి పన్నెండు గంటలు గొడ్డు చాకిరి చేసినా... గొర్రెకు బెత్తెడు తోక లాంటి జీతానికే జీవితం బలిచేస్తూ బతుకు గడుపుతూ ఉండగా–

ఒక శుభముహూర్తంలో–

ఎన్నికల సీజను అనుకోకుండా వచ్చేయడంతో–

తుపాను టైంలో హోరుగాలిలా ఉద్యోగాల



నోటిఫికేషన్లు వెల్లువలా వచ్చిపడ్డాయి. 1 : 100గా వున్న ఉద్యోగాలకు కాంపిటేటివ్ పరీక్షలు నిర్వహించబడతాయని తెలిసి... తలగడ దిండుల్లాంటి కాంపిటేటివ్ బుక్స్ రిఫర్ చేయడానికి ఉపక్రమించాడు సత్యం.

రోజుకి పన్నెండు గంటల పాటు గొడ్డులా ప్రయివేటు కంపెనీలో పని చేస్తూ ఇంచుమించు శవంలా తయారైన సత్యమూర్తికి పాపం చదివే తీరికా లేదు. రాసే ఓపికా లేదు. అలా అని అశ్రద్ధ చేస్తే అతని చదువుకు రావాల్సిన ఉద్యోగానికి... రాబోయే నోటిఫికేషన్లకు వయోపరిమితి కూడా చాలదు.

ఏం చేయాలో పాలుపోవడం లేదు సత్యంకు.

ఒక నెల రోజులు సెలవు పెట్టి చదువుకుంటే బాగుణ్ణనిపించింది.

'కడుపొచ్చినపుడు గవర్నమెంటు జాబుల్ల ఆడవాళ్ళకు మెటర్నిటీ లీవు శాంక్షన్ చేసినట్టు నీవు చదువుకోవడానికే సెలవులు కావాలంటే ఇవ్వడం కుదరదు. కావాలంటే పని మానెయ్" అంది నిక్కచ్చిగా ప్రయివేటు యాజమాన్యం.

'ముప్పై అయిదు సంవత్సరాలు దాటిపోయాక కూడా ఇంకా నీ ఎంప్లాయిమెంటు కార్డు రెన్యువల్ చేయడానికి వస్తున్నావంటే నీ అంత అమాయకుడు, 'మందమతి' ఇంకొకడు లేడయ్యా' అన్నారు ఎంప్లాయిమెంటు వారు.

"పనిమానేసి ఇంట్లో చదువుకుంటూ కూర్చుంటానంటే మనలాంటి వారికి ఎలా కుదురుతుంది? ఇప్పటికే ఫనీ పాటా లేని వాడి పెళ్ళాన్నని, పళ్ళెంలో అన్నం వడ్డించుకొనే స్వేచ్ఛ కూడా లేని దౌర్భాగ్యం నాది. ఉన్న ఈ పని కూడా మానేస్తే బతుకు మరీ హీనం అయిపోతుంది" అంది ఇరవయ్యోయేట సత్యానికి బలవంతంగా పెళ్ళి చేయబడిన పెళ్ళాం.

ఏం చేయాలో తెలియక ఊపిరి ఆడని చేపలా గిలగిలా గింజుకోసాగాడు సత్యం.

ఈ నోటిఫికేషన్‌లో నియామకాలు అయిపోయాక – రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధిలో పయనింప చేయడానికి మరో ఐదు సంవత్సరాల వరకూ ఎలాంటి రిక్రూట్‌మెంటులు ఉండవని ప్రకటించేశారు ప్రభుత్వం వారు.

'ప్రజలకు ప్రభుత్వం జీవనాధారం కల్పించడమే కాకుండా, మంచి జీవితం గడపడానికి అవకాశం కల్పించాలి. రాజ్యాంగ యంత్రానికి సారధ్యం వహించేవారు పక్కదారుల్లో నడవకుండా అందుకు తగ్గ సంస్కరణలు తీసుకురావాలి' అన్న అరిస్టాటిల్ వాక్కులను ఆసాంతం గాలికి వదిలేసి.. కుహనా రాజకీయాలతో యువతను మోసపుచ్చుతున్న ఈ ప్రభుత్వాలు – కనీసం పనిలేనివారు కడుపు నింపుకోవడానికి భృతి లభించేటట్లు పని కల్పించడంలో కూడా విఫలమై... ఈ దేశ యువతకు ఉపాధి కల్పిస్తున్నా ఉపయోగించుకోలేని సోమరులుగా చిత్రీకరిస్తున్నారు.

కాటికి పోయేవేళ కాంపిటేటివ్ పరీక్షలంటూ... వయసు దాటిపోయిందని వారిని గాలికి వదిలేస్తున్నారు. ఏం చేయడానికి దిక్కుతోచక... ఎలా బతకాలో తెలియక... ప్రయివేటు యాజమాన్యాల ఉక్కు పాదాల కింద ఊపిరి సలుపని సత్యాన్ని – ప్రభుత్వ చట్టాలు మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా...

"భగవంతుడా నన్నెందుకు పుట్టించావు తండ్రీ" అంటూ గొల్లుమంటున్నాడు. కానీ ఏ దేముడూ ప్రత్యక్షం కాలేదు. సత్యానికి చావూ రాలేదు. గిలగిలా కొట్టుకుంటూనే, కర్మభూమిలో పుట్టినందుకు – కనీసం ఓటు వేయడానికి పనికి వస్తాడని కాబోలు... కొన ఊపిరితోనైనా బతికి ఉండటం మంచిదని. ఏలిన వారు చంపకుండా వదిలేశారు.

మూడో చేపలాంటి ఆ 'నిరుద్యోగ సత్యమూర్తి' మీకు ఏ రోడ్డు మీదనైనా కొన ఊపిరితో కనిపించవచ్చు. మీకు దయ ఉంటే, బ్రతికించాలనుకుంటే... ఏ ప్రయివేటు మడుగులోనో అతనిని తోసెయ్యండి... 'జై... జన్మభూమి' అనుకుంటూ బతికేస్తాడు. ●

✻ అంపశయ్య నవీన్

సముద్రంలో నీటిబొట్టు

"అలా ఉన్నారేమిటి?"

"ఎలా ఉన్నాను?"

"ఎలా ఉన్నారో మీకు తెలియడం లేదా?"

"తెలియడం లేదు. మీకు తెలిస్తే చెప్పండి"

"దిగులుగా... దీనంగా.. ఏదో పోగొట్టుకున్న వాడిలా"...

"నిజంగా, ఏదో పోగొట్టుకున్న వాడిలా కనిపిస్తున్నానా?"

"కనిపిస్తున్నారు... అందుకు సందేహమా?"

"ఫేస్ ఈజ్ ఇండెక్స్ ఆఫ్ ది మైండ్ అని మన పెద్దలు ఊరికెనే చెప్పలేదన్నమాట!..."

"అంటే?"

"అంటే ఏముంది.. మనస్సులో ఉన్నది మనం ఎంత దాచుకోవాలనుకున్నా అది మన మొఖం మీద కనబడ్తూనే ఉంటుంది."

"ఇప్పుడు మీ మనస్సులో ఏముందో?"

"రెండేళ్ళుగా ఘనత వహించిన మన ప్రభుత్వం వారు మాకు డి.ఏ. చెల్లించడం మానేశారు కదా! ధరలు పెరిగినప్పుడు ఈ డి.ఏ. పెరగడం వల్ల ఎంతో కొంత ఉపశమనం ఉండేది... మాకిప్పుడది లేకుండా పోయింది కదా!"

"మరచే పోయాను... మీరు పెన్షనర్ కదా.. అసలు పెన్షనర్లకు జీతం.. అదే పెన్షన్ ఇవ్వడమే దండగంటే మీకు డి.ఏ. కూడా ఇవ్వడం ఎందుకని వరల్డ్‌బాంక్ వాడు అంటున్నాడట కదా..."

"వరల్డ్‌బ్యాంక్ వాడికేం? ఏదైనా అంటాడు. వినేవాడున్నప్పుడు చెప్పేవాడు చెప్పకేం చేస్తాడు.. సబ్సిడీ తీసెయ్యి... పబ్లిక్ సెక్టార్‌ను తీసెయ్యి.. డి.ఏ.లు తీసెయ్యి... ప్రజల ప్రాణాలు తీసెయ్యి... ఇదే కదా వరల్డ్ బ్యాంక్ వాడు చెప్పేది..."

"అసలీ వరల్డ్‌బ్యాంక్ వాడెవ్వడండీ బాబూ, మనకు చెప్పడానికి?"

"వరల్డ్‌బ్యాంక్ వాడెవడంటే నేనేం చెప్పాలి? వాడు అప్పిచ్చువాడు.. అప్పిచ్చువాడు చెప్పుచ్చుకు కొట్టినా పడాలి... పొద్దున లేస్తే అప్పో అప్పో అని మనం వాడినే ఆశ్రయిస్తున్నాము కదా..."

"అసలు ఇంత అప్పు చెయ్యాల్సిన ఖర్మ మనకేం పట్టిందండి.. ఇంత పెద్ద దేశం.. ఇన్ని సహజవనరులు.. ఇన్ని మానవ వనరులు... ఇంతమంది మేధావులు.. మన కాళ్ళమీద మనం నిలబడలేమంటారా?"

"ప్రజలు తమ కాళ్ళమీద తాము నిలబడగలిగితే ప్రభుత్వం మీద ఆధారపడరు గదా... అందుకే ఈ ప్రభుత్వాలు ప్రజల్ని ఎప్పుడూ తమ మీదనే ఆధారపడేట్టు చేస్తాయి... ప్రజల్ని పేదవాళ్ళుగా, బలహీనులుగా ఉంచడమే ప్రభుత్వాల లక్ష్యం... మొన్న "మార్క్‌టుల్లీ" అనే ఓ పెద్దాయన ఏమన్నాడో విన్నావు కదా"

"ఏమన్నాడేమిటి?"

"ఈ దేశంలో ప్రభుత్వమే ఒక పెద్ద సమస్యట! ప్రభుత్వం సమస్యల్ని పరిష్కరించడం మానేసి తనే ఓ పెద్ద సమస్యయి కూర్చుంది అన్నాడాయన."

"ఈ వరల్డ్‌బ్యాంక్ వాడిస్తున్న వేలవేల కోట్ల రూపాయల అప్పులన్నీ ఏమైపోతున్నాయంటారు?"

"ఆ వేల వేల కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నామంటారు.. కాలువలు నిర్మిస్తున్నామంటారు. ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నామంటారు. కానీ ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకెళ్తున్నదో తెలుసా?"

"మీరు చెప్పండి?"

"కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వాఫీసర్లు, వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు... వీళ్ళ జేబుల్లోకే సగానికి పైగా ఈ డబ్బంతా వెళ్ళిపోతుంటుందని అందరికీ తెలిసిన విషయమే... అందరికీ పర్సంటేజిలుంటాయి... ఇంట్లో కూర్చున్నా ఎవరి పర్సంటేజి వాళ్ళకు ముడ్తూనే ఉంటుంది. కొన్నిసార్లు కాలువలూ ఉండవు.. రోడ్లూ ఉండవు... బ్రిడ్జిలూ ఉండవు... అవన్నీ కాగితాల మీదనే ఉంటాయి... కోట్లకు కోట్ల రూపాయలు మాత్రం ఖర్చయిపోతుంటాయి.... అంతా ఫార్స్... అభివృద్ధి పేరుతో జరుగుతున్న ప్రహసనం... పేదరిక నిర్మూలన పేరుతో జరుగుతున్న ప్రహసనం. పేదరికపు నిర్మూలన కోసం ఖర్చు పెడుతున్న కోట్ల కోట్ల రూపాయల్లో అసలు పేదవాడికి ముడ్తున్నదెంతనుకుంటున్నారు.. ఒక రూపాయి ఖర్చు పెడ్తే అందులో ఓ పావలా మాత్రమే పేదవాడికి ముడ్తుంది. మిగతా 75 పైసలు బాగా డబ్బున్న మధ్య దళారీల జేబుల్లోకే వెళ్తున్నదని ఎందరో పరిశీలకులు చెప్పారు.... ఇన్నివేల వేల కోట్లను మధ్యదళారుల జేబుల్లోకి పంపిస్తున్న ప్రభుత్వం పెన్షనర్లకు డి.ఏ. ఇస్తే వృధా ఖర్చనుకొని నిలిపివేసింది.. ఎంత దారుణం! వృద్ధులైపోయి కాటికి కాళ్ళు చాపుకొని ఉన్న పెన్షనర్ల పట్ల ప్రభుత్వం ఇంత క్రూరంగా ప్రవర్తించడం ఎంత న్యాయం"

"పెన్షనర్లకు సర్వీసులో వున్న ఉద్యోగులకు చెల్లించినట్లుగానే డి.ఏ. చెల్లిస్తే ప్రభుత్వానికి అదనంగా ఎంత ఖర్చువుతుందంటారు?"

"ఎంతవుతుంది? ఓ 50 కోట్లు అవుతుందట! ప్రభుత్వ పథకాలను గూర్చిన ప్రచారానికే రోజూ ఓ కోటి రూపాయలు ఖర్చు పెడుతున్న ప్రభుత్వానికిదో పెద్ద ఖర్చా? సముద్రంలో నీటిబొట్టు"

"నాకు తెలీక అడుగుతున్నాను.. పెన్షనర్లు ఊరికేనే ఇంట్లో కూర్చుంటారు కదా.. వాళ్ళకు నెలనెలా పెన్షన్ ఎందుకివ్వాలంటారు?"

"భలే అడిగావులే... రామాయణమంతా విని రాముడికి సీత ఏం కావాలని అడిగాడట వెనకటికి నీలాంటి వాడొకడు.. ప్రతీ ప్రభుత్వోద్యోగీ తన జీవితకాలంలోని బెస్ట్ పీరియడ్‌ని ప్రభుత్వ సేవకే వినియోగిస్తాడు. ప్రభుత్వోద్యోగంలోనే గడుపుతాడు. కొందరు 58 సంవత్సరాలు నిండగానే, మరి కొందరు 60 సంవత్సరాలు నిండగానే పదవీ విమరణ చేస్తారు. తమ జీవిత కాలంలోని ప్రధాన భాగాన్ని ప్రభుత్వ సేవకు తద్వారా ప్రజాసేవకు అంకితం చేసిన ప్రభుత్వోద్యోగులు పదవీ విరమణ చెయ్యగానే వాళ్ళను వదిలేస్తే వాళ్ళేమైపోవాలి? ఎంతో దీర్ఘకాలం పాటు వాళ్ళు చేసిన సేవలకు గుర్తింపుగానే ప్రభుత్వం వాళ్ళకు నెలనెలా కొంత పెన్షన్ చెల్లిస్తున్నది. ఇంతకాలం ధరలు పెరిగినప్పుడు పదవిలో ఉన్న ఉద్యోగులకు చెల్లించినట్టే ప్రభుత్వం పెన్షనర్లకూ డి.ఏ. చెల్లిస్తుండేది. ఇప్పుడు అకస్మాత్తుగా వాళ్ళకు డి.ఏ. చెల్లించడం మానేస్తే వృద్ధాప్యంలో ఉన్న ఎంతోమంది పెన్షనర్లు ఎంతగా కృంగిపోతున్నారో ప్రభుత్వం అర్థం చేసుకుంటున్నదా? వాళ్ళకు చెల్లిస్తున్నదేమిటి? సముద్రంలో నీటిబొట్టు! పెన్షనర్ల మీద ఆ మాత్రమన్నా కనికరం లేకపోతే ఎలా? ●

* అరసవిల్లి కృష్ణ

గుర్రపు బగ్గీల పోటీ

అవంతీ దేశానికి రాజు విశ్వగుప్తుడు. తన దేశాన్ని పర్యాటక కేంద్రంగా, రూపొందించాలనే తలంపు వున్నవాడు. తన పాలనలో ప్రజలు కరువు కాటకాలతో అల్లాడుతున్నా, వర్షాల్లేక, పంటలు చేతికిరాక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా ఏమాత్రం పట్టించుకునేవాడు కాదు. పైగా ఎప్పుడూ అవంతీ దేశాన్ని విహార కేంద్రంగా తయారుచేయాలని కలలు కనేవాడు.

ఓ రోజు విశ్వగుప్తుడు కొలను దగ్గర కూర్చొని వెన్నెలను ఆస్వాదిస్తున్నాడు. అప్పుడే మహారాణి భువన అక్కడకు వచ్చింది. 'రాజా! ఈ వెన్నెలను చూస్తే మీకేమనిపిస్తోంది?' అని అడిగింది. విశ్వగుప్తుడు ఆలోచించి, "ఈ సమయంలో దేశంలోని సంపన్నులంతా విందు వినోదాలతో గడుపుతుంటారు. వారి కోసం, వారి ఆనందం కోసం ఇంకేదైనా చేయాలనే కోరిక కలుగుతోంది" అన్నాడు విశ్వగుప్తుడు.

రాజు ఆలోచనకు భువన ఆశ్చర్యచకితురాలయ్యింది. వెంటనే "మహారాజా! ప్రజలంతా ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. అటువంటప్పుడు మీరు వారి గురించి ఆలోచించకుండా ఎప్పుడూ భాగ్యవంతుల విందు వినోదాల గురించే కలతచెందటం ఏం బాలేదు. పైగా ఇది రాజుగా మీ పక్షపాత వైఖరికి అద్దం పడుతోంది" అంది భువన సూటిగా.

"ప్రియమైన సహచరీ! రాజుగా పదికాలాలపాటు పదవిలో వుండాలంటే సంపన్నుల పక్షమే వహించాలి" అన్నాడు విశ్వగుప్తుడు.

ఇంతలో రాజభటుడు ఓ వర్తమానం తీసుకొని వచ్చాడు. భువన దాన్ని విశ్వగుప్తుడికి చదివి వినిపించింది.

ఆ వర్తమానం విని విశ్వగుప్తుడు ఊహాలలో తేలిపోయాడు. 'ఇలాంటి అవకాశమొస్తుందని కలలో కూడా అనుకోలేదు' అంటూ చిరుమందహాసం చేశాడు. "రాజా! కరువు కాటకాలతో దేశం కొట్టుమిట్టాడుతున్నప్పుడు గుర్రపు బగ్గీల పోటీలు నిర్వహించడం అవసరమా?" తిరిగి ప్రశ్నించింది భువన.

"భువనా! ఈ అవకాశం సప్తసముద్రాల ఆవల నుండి వచ్చింది. ప్రతి యేడాది ఈ పోటీలను నిర్వహించడం వలన మన దేశం ఆదాయం పెరగడమే కాదు. ఇతర దేశాల నుండి విహార యాత్రికులు కూడా వస్తారు. ఈ దేశంలోని సంపన్నులను కూడా సంతృప్తిపరిచినట్లుంటుంది. తద్వారా దేశంపై నా పట్టు పెరుగుతుంది" అన్నాడు విశ్వగుప్తుడు.

"రాజా! పేదలను విస్మరించి, గుర్రపు బగ్గీల పోటీ నిర్వహించడం ప్రజలకు అన్యాయం చేయడం కాదా?" అంది భువన ఆగ్రహంగా.

"ప్రజల్ని బీదరికంలో వుంచడమే నాలాంటి తెలివైన రాజుల పరిపాలనా రహస్యం" అన్నాడు విశ్వగుప్తుడు. అతని ఆలోచనతో భువన ఏకీభవించలేకపోయింది. వాదించి లాభం లేదనుకొని మిన్నకుండిపోయింది.

***

అవంతీ దేశంలో గుర్రపు బగ్గీల పోటీల కోసం సకల సదుపాయాలు కలుగజేశాడు విశ్వగుప్తుడు. ఇలా కొంతకాలం గడిచింది. ప్రజల్ని నిర్లక్ష్యం చేసి, గుర్రపు బగ్గీల పోటీల నిర్వహణలో కాలాన్ని వెచ్చించాడు. పరిపాలనలో విఫలమయ్యాడు. విశ్వగుప్తుని నైతిక పతనాన్ని పొరుగునే వున్న శత్రురాజు గమనించి, గుర్రపు బగ్గీలలో రహస్యంగా సైన్యాన్ని తరలించి అవంతీ దేశాన్ని హస్తగతం చేసుకున్నాడు. తన తప్పు ఏంటో విశ్వగుప్తుడికి అప్పుడుగాని తెలిసిరాలేదు. ●





చిత్రమైన వేలు

హోయ్! నేస్తాలూ.... ఏం చేస్తున్నారు? సెలవల్లో బోర్‌గా వుందా? అందుకే మీకోసం కొత్త మేజిక్ తీసుకొచ్చాను. భలే తమాషాగా వుంటుంది. 'అసలు మేజిక్ ఏంటో చెప్పకుండా తమాషాగా వుంటుంది. అదీ ఇదీ అని ఉడికిస్తారెందుకు?' అనుకుంటున్నారు కొందరు చిన్నారులు. సరే. మీరలా అనుకుంటే మేమేం చెయ్యలేం. ఉన్న విషయం చెప్పాలి కాబట్టి చెప్పాం. సరే. ముందు మీరేం చేస్తారంటే... ఎంచక్కా ఒక కుర్చీలో కదలకుండా కూర్చోండి. తర్వాత మీ రెండు చేతుల చూపుడు వేళ్లను కంటికి ఎదురుగా పెట్టండి. ఎలాగంటే... సరిగ్గా బొమ్మలో కనిపిస్తోందే అలా. ఇప్పుడు రెండు కళ్లతో ఒకేసారి చూపుడు వేళ్ల మధ్యనుంచి చూడండి. ఏం కనిపించింది. రెండు వైపుల గోళ్లున్న విచిత్రమైన వేలు కనిపించిందికదూ. మరి అదే. ఇవాల్టి మేజిక్. మన కళ్లు చూస్తున్నమాట నిజమే. రెండు చూపుడు వేళ్లను కళ్లకు ఎదురుగా పెట్టినమాట నిజమే. కానీ ఈ వేళ్లు రెండూ కలిసి ఒక విచిత్రమైన వేలుగా కనిపించడమే నిజంకాదు. కాని మన కంటికి అలా కనిపిస్తుంది. అదే దృష్టిభ్రమ అంటే... సరే. ఈ వారానికి బైబై.

మేజిక్! మేజిక్!!

చిన్నారి చిత్రకారులు

డి.జగదీశ్, 5వ తరగతి,
ఆంధ్రాపబ్లిక్‌స్కూల్,
జగన్నాథపేట.

జి.రామ్, 3వ తరగతి,
గీతాంజలిపబ్లిక్‌స్కూల్,
రెడ్డిగూడెం.

జి.లక్ష్మణ్, 3వ తరగతి,
గీతాంజలిపబ్లిక్‌స్కూల్,
రెడ్డిగూడెం.

సిహెచ్.గిరిధర్,
9వ తరగతి,
కందుకూరు.

వావ్! ఏం బొమ్మ!!



ఈ బొమ్మ భలే వుందికదూ. ఇందులో ఒక ప్రత్రేకత వుంది. అదేంటంటే... కొన్ని వృత్తములు, త్రిభుజములు, చతురస్రములు, దీర్ఘ చతురస్రములు, వక్రరేఖలతో దీన్ని గీశారు. ఇంతకీ ఈ బొమ్మ వేసింది ఎవరనుకున్నారు? పాలపర్రులో 9వ తరగతి చదువు తున్న డి.సంజీవరావు. **మరి ఈ నేస్తాన్ని చప్పట్లు కొట్టి అభినందిద్దామా. మీకూ ఇలాంటి కొత్త ఆలోచనలు ఏమైనా వస్తే మాకు వంపించడం మర్చిపోవద్దు. మేం ఎంచక్కా 'బాలనేస్తాలు'లో ప్రచురిస్తాం. సరేనా! అసలు విషయం ఏంటంటే.... ఈ బొమ్మకు రంగులు అద్ది చూడండి. సూపర్‌గుంటుంది.**

క్విజ్-89

1. **రైళ్లు ఆగే స్థలాన్ని ఏమంటారు?**
   ఎ. జంక్షన్ బి. రైల్వే స్టేషన్
2. **మన జాతీయ జంతువు ఏది?**
   ఎ. పులి బి. సింహం
3. **అమెరికాను కనుగొన్న నావికుడెవరు?**
   ఎ. కొలంబస్ బి. మెగస్తనీస్
4. **'ఎడారి ఓడ' అని దేనిని అంటారు?**
   ఎ. ఒంటె బి. ఏనుగు
5. **'ఆంధ్రభోజుడు' అని ఎవరిని పిలుస్తారు?**
   ఎ. శ్రీకృష్ణదేవరాయలు బి. రాజరాజ నరేంద్రుడు
6. **సమిష్టి కుటుంబంలో కనీసం ఎన్ని తరాల వారుంటారు?**
   ఎ. రెండు బి. మూడు
7. **ఆమ్లాలకు ఉదాహరణ?**
   ఎ. చింతపండు బి. అల్లం
8. **ఏ దేశంలో అత్యధికంగా పులులు వున్నాయి?**
   ఎ. భారత్ బి. అమెరికా
9. **ఊపిరితిత్తులలోకి గాలిని తీసుకోవడాన్ని ఏమంటారు?**
   ఎ. నిశ్వాసము
   బి. ఉచ్ఛ్వాసము
10. **ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?**
    ఎ. మహాశ్వేతాదేవి
    బి. రంగనాయకమ్మ

క్విజ్ 88కి జవాబులు

1. సింహాచలం 2. జంక్షన్ 3. టండ్రాలు 4. ఆహారపంటలు 5. మహబూబ్‌నగర్ 6.పూర్వపు సోవియట్ యూనియన్ 7. గవర్నర్ 8. మత ప్రమేయంలేని 9. తీపి, ఉప్పు 10. రాహుల్ ద్రావిడ్

క్విజ్ 87కి సరైన సమాధానాలు రాసిన వారు :

సిహెచ్. రమేష్‌బాబు, పుట్రేల, కృష్ణాజిల్లా. ఎం.ఎన్.మాధవీలత, 6వ తరగతి, గుంటూరు. బి.అనూష, 9వ తరగతి, అరసవిల్లి, శ్రీకాకుళం. జి.వినాయకరావు, 5వ తరగతి, తిరుపతి. కె.బసవేశ్వరరావు, 6వ తరగతి,కాశీబుగ్గ. డి.ఉమశ్రీ, 10వ తరగతి, కృష్ణలంక, విజయవాడ. మునిగోటి ఫణి గౌతం శర్మ, నీరుగట్టువారిపల్లె, చిత్తూరు.

కలం స్నేహం

పేరు: డి.రమ్యశ్రీ,
వయసు : 13 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, కథలు చదవడం. ఆడుకోవడం.
పూర్తి చిరునామా :డి.రమ్యశ్రీ, 8వ తరగతి, డాటరాఫ్ యాదగిరి.డి. నాగార్జున పబ్లిక్‌స్కూల్, చౌటుప్పల్, నల్లగొండ.



పేరు: వి. అశోక్‌కుమార్,
వయసు : 16 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం.
పూర్తి చిరునామా : వి. అశోక్‌కుమార్, సన్నాఫ్ వి. శేఖరయ్య చౌదరి, మునగాల, మహబూబ్‌నగర్.

కలం స్నేహం చేయాలని వుందా!

మరి ఆలస్యం ఎందుకు? ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా: బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

ఐకమత్యం



పంచతంత్ర కథలు

చిత్రగ్రీవుడు చెప్పిన కథ విని ఒక ముసలి పావురం పెద్దగా నవ్వింది. 'ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు నాలాంటి పెద్దల దగ్గర సలహాలు తీసుకోవాలి. అంతేకాని అనవసరపు అనుమానాలతో నోటి దగ్గర కూడు పోగొట్టుకుంటామా? వదండి. నూకలు తిందాం' అంది. వెంటనే పావురాలన్నీ నేలమీద వాలాయి.

మరుక్షణమే వలలో చిక్కుకున్నాయి. తర్వాత పావురాలన్నీ కలసి ముసలి పావురాన్ని తిట్టాయి. 'ఎవరు బుద్ధిమంతులో వారు పెద్దగానీ, వయసు ముదిరినంత మాత్రాన పెద్దకాదు. ఆపద వచ్చినప్పుడు అందులోంచి తప్పించుకునే మార్గం చూడాలికానీ, ఒకరినొకరు నిందించుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఇప్పుడు నాకొక ఉపాయం తోస్తున్నది. మనమంతా వలతోసహా ఎగిరిపోదాం. ఐకమత్యంతో సాధించలేనిది ఏమీ లేదు' అన్నాడు చిత్రగ్రీవుడు. అందరికీ ఆ మాటలు నచ్చాయి. సంతోషంగా గాలిలోకి లేచాయి. పొదల మాటున దాగిన వేటగాడు ఆ దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. వల వెంటే నేలమీద నడవసాగాడు. ఇదంతా చూస్తున్న లఘుపతనకానికి ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న కోరిక పుట్టింది. పావురాల వెంటే అదీ ఎగరడం మొదలెట్టింది.

'కానీ ఇలా ఎంత దూరం ఎగరాలి? ఈ వలలోంచి బయటపడే మార్గం ఆలోచించాలి' అనుకున్నాయి పావురాలు. అప్పుడు చిత్రగ్రీవుడు ఒక చెట్టు చూపించి 'నేస్తాలూ... ఇక్కడ దిగుదాం. ఈ చెట్టుకింద నాకో ఎలుక స్నేహితుడు వున్నాడు. అతని పేరు హిరణ్యకుడు. మనకు తప్పకుండా సహాయం చేస్తాడు' అన్నాడు.

పావురాలు కిందకు వాలడం చూచి హిరణ్యకుడు కలుగులోకి దూరిపోయాడు. అప్పుడు చిత్రగ్రీవుడు పెద్దగా హిరణ్యకా! నేను నీ బాల్యమిత్రుడను. చిత్రగ్రీవుడ్ని. నీ సహాయం కోసం వచ్చాం' అన్నాడు.

అప్పుడు హిరణ్యకుడు బయటకు వచ్చి సంగతంతా తెలుసుకుని చిత్రగ్రీవుడి దగ్గర వల కొరకడం మొదలెట్టాడు. వలంతా కొరికే బలం తన దగ్గర లేదన్నాడు. 'నీకు ఓపిక వున్నంత వరకే మమ్మల్ని విడిపించు. కాకపోతే ముందు నా మిత్రులను వదిలించు. చివరికి నీకు బలం వుంటే నన్ను విడిపిద్దువుకాని' అన్నాడు చిత్రగ్రీవుడు.

ఆ మాటలకు హిరణ్యకుడు ఎంతో సంతోషంతో 'నీలాంటివాడు నాకు మిత్రుడైనందుకు ఎంతో ఆనందంగా వుంది. నీవు చెప్పినట్టే చేస్తాను' అని వల తాళ్లన్నిటినీ కొరికేశాడు. ఆఖరికి చిత్రగ్రీవుడిని విడిపించాడు. అప్పుడు పావురాలన్నీ హిరణ్యకుడికి ధన్యవాదాలు తెలిపాయి. వేటగాడి వలలో చిక్కిన పావురాలను ఎలుక కాపాడడం చూసి లఘుపతనకం ఎంతో సంతోషించింది. హిరణ్యకుడితో స్నేహం చేయాలని నిర్ణయించుకుంది.

మార్మోసెట్



ప్రపంచంలోకెల్లా అతి చిన్న కోతి జాతికి చెందినది మార్మోసెట్. ఇది 30 సెంటీమీటర్ల పొడవుంటుంది. సుమారు 300 గ్రాముల బరువుంటుంది. మిగతా కోతుల్లా కాకుండా వీటికి పదునైన వంపు తిరిగిన గోళ్లుంటాయి. ఇవి చెట్లపైనే వుండి, ఉడతల్లా పరుగెడతాయి. మార్మోసెట్‌లలో 10 రకాలున్నాయి. పిగ్మీ మార్మోసెట్ 15 సెం.మీ పొడవు మాత్రమే వుంటుంది. పళ్లు, చిన్న కీటకాలు తినే ఈ కోతులు దక్షిణ అమెరికా ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తాయి.

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

వెలుగు రేఖలు విచ్చుకోలేదు.

ఎప్పుడు తెల్లవారుతుందా, న్యూస్‌పేపర్ ఎప్పుడు వస్తుందా అని సుధాపటేల్‌కు ఆతృతగా ఉంది. రాత్రంతా మగత నిద్రలోనే గడిపింది.

రోజూ పేపర్ వచ్చే సమయం తెలుసు.

ఇంటి వరండాలో దబ్బున చప్పుడు అవుతుంది. ఆ వెంటనే సైకిలు బెల్లు మోగుతుంది. ఆ సంకేతాలు పేపరు బాయ్ వచ్చినట్టు మనసుకు సంకేతాన్ని ఇస్తుంది.

ముందుగదిలోకి వెళ్ళి పేపరు తెచ్చి తమ్ముడ్ని లేపుతుంది. వాడు ఏ పేజీలో ఏ వార్త ఉందో చదివి వినిపిస్తుంటాడు. హెడ్డింగులు వింటూ ఆసక్తి కలిగించే వార్తను పూర్తిగా చదివించుకుంటుంది.

వెలుగు దివ్వె

ఆ రోజు సుధాపాటిల్ ఎదురు చూస్తోంది. వార్తలు తెలుసుకోవడానికి కాదు. తన ఎమ్.ఏ. పరీక్ష ఏమైందా అన్న విషయం గూర్చి.. వచ్చే రిజల్సు గూర్చి ఆతృత పడుతోంది.

పేపరు రాకముందే తమ్ముడ్ని కూడా నిద్రలేపింది.

అరగంట ఆలస్యంగా ఆరుగంటలకు పేపరుబాయ్ రావడం, పేపరు విసరడం జరిగిపోయాయి. సుధ ముందు గదిలోకి వెళ్ళేలోగా తమ్ముడు రాజేష్ పటేల్ పేపరు పట్టుకుని వచ్చాడు.

సుధాపటేల్ మనసు ఉద్వేగానికి లోనైంది.

"అక్కా! నువ్వు ఎం.ఎ.లో ఫస్టుక్లాసులో పాసయ్యావు... ఇదిగో నీ నంబరు!"

సుధ దగ్గరగా వచ్చి 'నిజంగానా! సరిగా చూడు 5243281 హాల్ టిక్కెట్టు నెంబరు గుర్తుంది కదా!"

"అవునక్కా! నీ నంబరు నాకు తెలియదా! ఇదిగో ఆనంద్‌లో ఉన్న సర్దార్ పటేల్ యూనివర్సిటీ ఎం.ఎ. ఫలితాలు... హిందీలో పోస్టు గ్రాడ్యుయేషన్ ఫలితాలు.. మొదట్లోనే నీ నంబరు ఉంది" రాజేష్ పేపరు చదివి వివరించాడు.

సుధకు ఎంతో ఆనందం అనిపించింది.

ఆమె కళ్ళల్లో ఆనందం తొణికిసలాడింది. అప్రయత్నంగా మూసిన కళ్ళ నుంచి కన్నీళ్ళు వర్షించాయి. రెండేళ్ళ తన కృషికి ఫలితం లభించిందని మనసు సంతృప్తిగా నిట్టూర్చింది.

"రాజేష్! థాంక్స్‌రా! నీకు మంచి స్వీట్సు ఇస్తానులే ! ఉదయాన్నే మంచి వార్త చెప్పావు!" అంది.

ఆ తర్వాత చుట్టుపక్కల వారు, స్నేహితులు అందరూ వచ్చి సుధను అభినందించారు. కళ్ళు లేకపోయినా ఆమె సాధించిన విజయం గొప్పదని పొగడ్తల వర్షం కురిపించారు.

పది గంటల సమయంలో స్థానికంగా ఉన్న రెండు పత్రికలు, ఒక జాతీయ పత్రిక విలేకర్లు సుధ ఇంటికి వచ్చారు. ఇంటిలో వారు మొదట ఆశ్చర్యపోయారు.

గుజరాత్ రాష్ట్రం ఆనంద్‌లో ఉన్న సర్దార్ పటేల్ యూనివర్సిటీ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన మొదటి అంధురాలుగా సుధాపటేల్ గుర్తింపబడింది. విలేకర్లు అదే విషయాన్ని చెప్పి ఆ వివరాలు చదవడానికి ఆమె పడిన కష్టం... పట్టుదల వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆ మరునాడు అన్ని పత్రికల్లో సుధాపటేల్ ఫొటోలతో ఆమె సాధించిన కృషిని వివరిస్తూ వార్తలు వెలువడ్డాయి. అంతవరకు ఎవరి దృష్టిలో పడని సుధ గుజరాత్ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపును స్వంతం చేసుకుంది.

* * *

గుజరాత్ రాష్ట్రంలో ఖేడా జిల్లాలో చాంగా గ్రామం ఒక చిన్న పల్లెటూరు. అధికారుల ఎవరి దృష్టీ పడని ఒక కుగ్రామం. అంధురాలైన సుధాపటేల్ చదువు గూర్చి వెలుగులోకి రావడంతో అందరి దృష్టినీ ఆకర్షించింది.

ఆ సమయంలోనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. వివిధ రాజకీయ పార్టీలు తమ మద్దతుదారులను రంగంలోకి దించాలని ప్రయత్నాలు ప్రారంభించాయి.

చాంగా గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయమని సుధాపటేల్ వద్దకు ప్రతిపాదన వచ్చింది. గ్రామంలో కొంతమంది పెద్దలు సుధ తండ్రి విజేంద్రనాధ్ పటేల్ వద్దకు వచ్చి ఒప్పించారు.

"అమ్మాయికి ఇష్టమైతే నాకు అభ్యంతరం లేదు!" అన్నారు.

గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు సుధను సంప్రదించారు "అమ్మా! నువ్వంటే గ్రామంలో అందరికీ ఇష్టం. ప్రజలకు, నువ్వు పుట్టిన గ్రామానికీ ఏదైనా చేయాలని అనుకుంటే ఒక్కదానివీ చేయలేవు. ఈ గ్రామ ప్రతినిధిగా ఏమైనా చేయగలవు. నిన్ను గెలిపించే బాధ్యత మాది!" అన్నారు.

సుధాపటేల్ ఏమీ మాట్లాడలేకపోయింది.

"అంధురాలినైన నేను ఏం చేయగలను?"

"అంధత్వం నీ కళ్ళకు తప్ప మరి దేనికీ లేదమ్మా! నువ్వు తలచుకుంటే ఏమైనా చేయగలవు.

సుధాపటేల్ చేసిన కృషికి ప్రత్యేక గుర్తింపు లభించింది. భారత ప్రభుత్వం గ్రామీణ మంత్రిత్వ శాఖ ద్వారా వివిధ రాష్ట్రాల్లో, గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన నివేదికలో సుధాపటేల్ వివరాలు చోటు చేసుకున్నాయి. దాని ఆధారంగా వాస్తవ విషయాలను అధ్యయనం చేసి, అవుట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ ఆఫ్ ది వరల్డ్ అనే అవార్డును ఆమెకు ప్రధానం చేశారు. ఈ అవార్డు అందుకోవడానికి హవాయ్ రావాలని ప్రత్యేక ఆహ్వానాన్ని పంపారు.

గ్రామ పరిపాలన నీకు ఏమంత కష్టం కాదు" అన్నారు.

వారి మాటలు నిజం అనిపించాయి. సర్పంచ్‌గా సుధాపటేల్ నామినేషన్ వేసింది.

ఆమె అభ్యర్థిత్వాన్ని గ్రామస్తులంతా అంగీకరించారు.

అత్యధిక మెజారిటీతో సుధాపటేల్ సర్పంచ్‌గా ఎన్నికైంది. ప్రమాణం కూడా చేసింది.

సర్పంచ్ పదవి తనకు లభించిన అరుదైన వరంగా ఆమె భావించింది. 1995 నుంచి ప్రజాసేవ చేయడానికి ఎన్నిక కాబడ్డానని ఆమె గుర్తించింది. అందుకు అనుగుణంగా తన కృషిని ప్రారంభించింది.

ముందుగా వార్డు సభ్యులను సమీకరించింది.

గ్రామంలో అర్హులైన వారందరూ తప్పనిసరిగా కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించుకోవాలని కోరింది. ఇద్దరు పిల్లల కన్నా ఎక్కువ మంది మంచిది కాదని మహిళలందరికీ చెప్పింది. అధిక జనాభా వల్ల జరుగుతున్న అనర్థాలను రకరకాల సదస్సుల ద్వారా గ్రామస్తులందరికీ వివరించింది. దాంతో గ్రామంలో అర్హులైన దంపతులందరూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నారు. ఆమె చేసిన కృషికి ఆరోగ్య శాఖ అధికారులు విస్తుపోయారు.

ప్రతి పది ఇళ్ళకు ఒక గొట్టపు బావి విధానాన్ని అమలు చేసి గ్రామంలో నీటి సమస్య లేకుండా చేసింది. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని బడి ఈడుగల వారందరినీ పాఠశాలలో చేర్పించింది. బడికి వచ్చే అవకాశం లేనివారికి, వయోజనులకు రాత్రి పాఠశాల ఏర్పాటు చేసి అందరూ రాయడం, చదవడం వచ్చేలా కృషి చేసింది. ఈ కార్యక్రమం నిర్వహించడానికి వలంటీర్లను కూడా నియమించింది.

గ్రామంలో పాఠశాల, ఆరోగ్య కేంద్రం, సామాజిక భవనం, సమావేశం నిర్వహణ హాలు, కల్యాణ మండపం వంటి భవనాల నిర్మాణం పూర్తి చేసింది. పాఠశాలలో కంప్యూటర్ విద్య ప్రవేశ పెట్టింది.

ఇరవై రెండేళ్ళ వయసులో సర్పంచి బాధ్యత స్వీకరించినప్పటికీ ఆమె చేసిన కృషి వయసు మళ్ళిన వారు కూడా చేయలేరని నిరూపించింది. దేశం మొత్తం మీద అంధురాలైన మొదటి సర్పంచి, అతి చిన్న వయసులో ఎన్నికైన వ్యక్తిగా ఆమె గుర్తింపు పొందింది.

కేవలం గ్రామానికి సేవలు చేయడమే కాకుండా తనను తాను ఎంతో అభివృద్ధి చేసుకుంది. లా చదువును పూర్తి చేసింది. హిందీ సాహిత్యంలో పి. హెచ్.డి. సంపాదించడానికి దరఖాస్తు చేసి సీటు సంపాదించింది. ఇందుకు సంబంధించిన ప్రయత్నాలు కూడా ప్రారంభించింది.

గుజరాత్ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఆమె కృషి గుర్తింపబడింది. ఆమె చేసిన ప్రయత్నాలు వార్తా కథనాలు పత్రికల్లోనూ, టీవీల్లోనూ రావడంతో సుధాపటేల్ ప్రత్యేకంగా గుర్తింపబడింది.

* * *

మిట్టమధ్యాహ్నం

చాంగా గ్రామ పంచాయితీ కార్యాలయంలో సుధాపటేల్ విధి నిర్వహణ చేస్తున్నారు. అంతకుముందురోజే గ్రామంలో మహిళలంతా సన్మానించి 'హెలెన్ కిల్లర్ ఆఫ్ చాంగా' అనే బిరుదు ప్రదానం చేశారు.

"మేడం మీకు భారత ప్రభుత్వం నుంచి ఉత్తరం వచ్చింది!" బరువుగా వున్న ఒక కవరును పోస్టుమేన్ అందించాడు.

"ప్రభుత్వం నుంచా?'' సుధ అందుకున్నారు. ఇంటికి కబురు పంపి తమ్ముడ్ని రప్పించి ఉత్తరం చదవమని పురమాయించింది.

సుధాపటేల్ చేసిన కృషికి ప్రత్యేక గుర్తింపు లభించింది. భారత ప్రభుత్వం గ్రామీణ మంత్రిత్వ శాఖ ద్వారా వివిధ రాష్ట్రాల్లో, గ్రామాల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన నివేదికలో సుధాపటేల్ వివరాలు చోటు చేసుకున్నాయి. దాని ఆధారంగా వాస్తవ విషయాలను అధ్యయనం చేసి, అవుట్ స్టాండింగ్ యంగ్ పర్సన్ ఆఫ్ ది వరల్డ్ అనే అవార్డును ఆమెకు ప్రధానం చేశారు. ఈ అవార్డు అందుకోవడానికి హవాయ్ రావాలని ప్రత్యేక ఆహ్వానాన్ని పంపారు. చదివి ఈ వివరాలన్నీ రాజేష్ పటేల్ అక్కకు వివరించాడు.

హవాయ్ వెళ్ళడానికి భారత ప్రభుత్వ అనుమతి, ప్రత్యేక వీసా... ఆ దేశం నుంచి ప్రభుత్వానికి అందిన సమాచారపు ప్రతి దానిపై కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి లేఖ వంటి కాగితాలు ఆ కవరులో ఉన్నాయి. వాటిని చూడలేకపోయినా చేతితో పట్టుకుని సుధ పొంగిపోయింది. తట్టుకోలేని సంతోషం కలిగినప్పుడు అప్రయత్నంగా ఆమె కళ్ళు వర్షిస్తాయి.

రెండు నిమిషాలు ఆమె మాట్లాడలేకపోయింది.

"ఏమిటక్కా అలా ఉండిపోయావు. నిజంగా నువ్వు అదృష్టవంతురాలివి. ఎంతో పెద్దవారికి మాత్రమే లభించే అవార్డు నీకు లభించింది" అన్నాడు.

"ఎప్పుడు వెళ్ళాలి!"

మళ్ళీ ఉత్తరం చదివి వివరించాడు.

ఆ తర్వాత సుధాపటేల్ హవాయి వెళ్ళి ఎంతోమంది ప్రముఖుల కరతాళ ధ్వనుల మధ్య అవార్డును స్వీకరించింది. అన్ని అవయవాలు సక్రమంగా వున్న వారు సాధించలేనిది కృషితో సుధ సాధించిందని వక్తలు పొగడ్తల వర్షం కురిపించారు. అంధురాలైనా ఒక చిన్న గ్రామంలో అభివృద్ధి వెలుగులు నింపిన ఆమె అభినందనీయురాలని పేర్కొన్నారు.

అవార్డు పత్రం, బంగారు మెడల్‌తో పాటు హవాయి ప్రభుత్వం అందించిన యాభై లక్షల రూపాయల నగదుతో మాతృభూమికి తిరిగి వచ్చిన సుధాపటేల్‌కు అపూర్వమైన స్వాగతం లభించింది. తమకే అవార్డు వచ్చినట్లుగా అందరూ పొంగిపోయారు.

అభినందన సభ ఏర్పాటు చేశారు. అందరూ పొగడ్తలతో ముంచెత్తిన తర్వాత సుధాపటేల్ మాట్లాడింది.

"ఈ గ్రామం నా తల్లిలాంటిది. మీరందరూ నన్ను ఆదరించారు. మీ నాయకురాలిగా ఎన్నుకున్నారు. నాకు చేతనైనంతగా అభివృద్ధి చేశాను. నాకు అవార్డు వచ్చిందంటే దానికి కారణం మీరే. మీ కళ్ళతో నన్ను నడిపించారు. గ్రామం ఎలా ఉండాలని మీరు కోరుకున్నారో నేను అలా కలలు కన్నాను. ఆ కలలను సాకారం చేయడానికి ప్రయత్నించాను. ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు. ఈ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్ళాలి... అందుకే నాకు లభించిన అవార్డు సొమ్ము కూడా గ్రామాభివృద్ధికే వినియోగించాలని నిర్ణయించాను. నాకున్న శక్తితో గోరంత దీపాన్ని వెలిగిస్తాను. ఇది ఊరంతా వెలుగును ఇస్తుంది. ఈ వెలుగు నా కళ్ళల్లో కోటి కాంతుల్ని వెలిగిస్తుంది... సుధా పటేల్ చెప్పడం ఆపింది.... గుండెలో మెలి తిరిగిన బాధ మాటలు బైటికి రానివ్వలేదు.... దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. మరి మాట్లాడలేక చేతులెత్తి నమస్కరించి కూర్చుండిపోయింది.

గ్రామస్తులంతా హర్షధ్వానాలు చేశారు. ఏకధాటి వారు కొట్టిన చప్పట్లు చాంగా గ్రామంలో ప్రతిధ్వనించాయి. ●

భర్త విన్యాసం...

కలకంఠి కంటినీరొలికితే -
ఆ ఇంట సిరి వుండబోదన్నారు!

ఈ లింకు గమ్మత్తుగా వుందేమిటని ముక్కుమీద వేలేసుకుని ఆశ్చర్యం నటించినంతమాత్రాన ఈ సూక్తి గాలికొట్టుకుపోదు!

ఎప్పుడు ఆడపిల్ల ఏడ్చినా ఈ బీభత్సం జరుగుతూనే వుంటుంది! లంకలో సీతమ్మ కన్నీరు పెట్టుకుంది! రావణాసురుడి రాజ్యం తగలబడిపోయింది!

మహాభారతంలో కౌరవులు ద్రౌపదిని ఏడిపించేరు! వాళ్ళ చిరునామా తుడిచిపెట్టుకుపోయింది!

ఆదికాలం నుంచీ ఈ తంతు ఇట్లాగే సాగుతూ వస్తోంది!

అంచేత-

ఆడపిల్లల్ని ఏడిపించకండి. మట్టికొట్టుకుపోతారు!

సిరికూడా ఆడపిల్లే! ఎంతైనా స్వజాతి అభిమానం! తన జాతి మనిషి కన్నీటిని చూసి ఆ తల్లి తట్టుకోలేదు. ఆడపిల్లను ఏడిపించిన వాళ్ళకి శాపం పెడుతుంది. సుఖం లేకుండా చేస్తుంది! జాగ్రత్త!

కష్టసుఖాల మాట అవతలపెట్టండి. అవి ఆడా మగా అనే తేడాల్లేకుండా వస్తాయి! కష్టాలొచ్చినప్పుడు ఆటోమేటిగ్గా కన్నీరొస్తుంది!

ఆ కన్నీటి గురించి కాదు పెద్దలు చెబుతున్నది!

పనిగట్టుకుని ఆడవాళ్ళను ఏడిపించే కిరాతకమైన సందర్భాల్లో ఈ సూక్తిని అన్వయించుకోవాలి. అబల అని జాలి పడకుండా ఆమెను హింస పెట్టే ప్రతి మగాడూ మట్టికొట్టుకుపోతాడు!

అంచేత -

భార్యని ఏడిపించే భర్తక్కూడా పుట్టగతులుండవని చెప్పాలి! ఈ సూక్తి భూలోకంలో ప్రతిభర్తకీ తెలుసు!

అంచేత -

సదరు భర్త మహాశయుడు తన భార్యకంటె - తన పుట్టగతుల మీద శ్రద్ధెక్కువగా పెట్టుకుని జాగ్రత్త పడుతుంటాడు!

ఆమెను అతడు కొట్టక్కర్లేదు. తిట్టక్కర్లేదు!

అతని ప్రైవేటు వ్యవహారాలు భార్యామణికి తెలిసినా - ఆమె కళ్ళు చెమర్చుతాయి. కుమిలి కుమిలి ఏడుస్తుంది. ఏడిస్తే కన్నీళ్ళొస్తాయి!

కన్నీరొలికిందో -
కొంపమునుగుతుంది!

ఇన్ని భయాలు కడుపులో పెట్టుకునే అతడు భార్యముందు బుద్ధిమంతుడల్లె ప్రవర్తిస్తాడుగాని - ఆమె పట్ల భయభక్తులుండి కానేకాదు!

అతని ప్రవర్తనంతా కేవలం నటన!

భార్య నమ్మితే చాలు - ఒక పనైపోతుంది!

నా భర్త కడు బుద్ధిమంతుడనుకుంటుంది! అంచేత కుమిలి కుమిలి ఏడవదు. అంచేత అతని తాలూకు వచ్చే జన్మ దిక్కుమాలిన టైపులో కచ్చితంగా వుండదు!

ఒక ఉదాహరణ చెప్పుకుందాం!

ఆఫీసు అయిపోతుండగా అతనికెవడో ఫోను చేస్తాడు. పార్టీ పెట్టుకున్నాం. వాలిపొమ్మని ఆహ్వానిస్తాడు. ఎవడు పిలిచినా రెక్కలు కట్టుకు వాలిపోదామనే మూడ్‌లో హీరో - అప్పటికే ఆలిస్యమైపోయినట్టు ఇదిగో వచ్చేస్తున్నానంటూ వెళ్ళిపోతాడు!

పార్టీలో కూచునే సమయానికి చీకటి పడుతుంది. పార్టీ పూర్తయ్యే సరికి పదో పదకొండో అవుతుంది. మనిషి తూలిపోతున్న శాస్త్రం మాత్రం బాగా జ్ఞాపకం పెట్టుకుని వుంటాడు...!

తనని తన భార్య ఆ స్థితిలో చూస్తే ఆమె కన్నీరు తనకి తప్పకుండా శాపం పెడుతుందేమోనని భయం పట్టుకు పీడిస్తూ వుంటుంది. ఆ మత్తులోనే -ఇంట్లో ఏమి చెప్పి కలకంఠి కంటినీరు వరద కాకుండా చేయాలో పథకం ఆలోచిస్తాడు!

మందులో వుండి ఆలోచించే పథకాలకు పవరెక్కువని మందు మనుషులు భావిస్తారు గనక - ఆటో ఎక్కి తాను ఆలోచిస్తున్న పథకాన్ని రిహార్సిలు చేసుకుంటాడు! ఈ వరస తెలీని ఆటోమనిషి ఈ పీడని వదిలించుకునే నిమిత్తం ఆటో వేగం పెంచుతాడు!

ఇంట్లో-

భార్యామణి అన్నం తినకుండా భర్త కోసం ఎదురు చూస్తూ వుంటుంది. ఏ లారీ కిందో బస్సుకిందో పడి వుంటాడనే దర్టీ ఆలోచనతో సతమతమవుతూ వుంటుంది. వాటి తాకిడి తట్టుకోలేదు. భర్తని క్షేమంగా ఇంటికి చేర్చుమని వెంకన్న స్వామిని వేడుకుంటుంది. క్షణానికోసారి మెళ్ళో మంగళసూత్రాన్ని కళ్ళకద్దుకుంటూ వుంటుంది!

ఇంత ఖంగారూ ఆందోళనలతో అల్లాడిపోతున్న అర్ధాంగి బొమ్మని స్వయంగా చూసే అవకాశం ఆ భర్తకి లేదు. ఇంటో ఏ టైపు స్టోరీ చెప్పి ఆమె కన్నీటికి తెరవేయాలనే ఆలోచనతో అతని మెదడు బిజీగా వుంటుంది!

ఇంటి దగ్గిర ఆటో ఆగుతుంది!

తప్పటడుగుల్తో గృహప్రవేశం చేస్తాడు. భర్తని చూడగానే ఎంతో ఉద్వేగంతో ఆమె భర్తని పెనవేసుకుంటుంది - ఏమండీ మీరు క్షేమమే కదా అనే టైపులో!

అతన్నుంచి స్పిరిట్ వాసన తగలగానే షాకు తగిలినట్టవుతుంది. అతన్నుంచి దూరంగా కదుల్తుంది! తాగి వచ్చేరా అని అడుగుతుంది! ఇక కన్నీరొక్కటే తరువాయి!

అప్పుడు అతను ప్రారంభిస్తాడు సంధివాగుడు! కర్తాకర్మా క్రియలుండవు. లింకులసలే వుండవు. తాను ఎందుకు ఆలిస్యంగా వచ్చేడో - ఆ టైపు భాషలో కథలనేకం చెబుతున్నప్పుడు విస్తుబోతుంది ఇల్లాలు!

కన్నీరు పెట్టుకోవాలో కథలు చెప్పే భర్తని సముదాయించడంలో తెలీక తెల్లబోతుంది ఇల్లాలు! తాను ఊహించినట్టు లారీకిందో బస్సుకిందో పడి పచ్చడిగాకుండా - భర్త భద్రంగా ఇంటికొచ్చినందుకు మళ్ళా మంగళసూత్రాన్ని కళ్ళకద్దుకుంటుంది. అర్ధాంగి కదా - అంతకంటే ఏం చేస్తుంది!?

ఓటు తూణీరం ఓటి బాణాలు



పచ్చబాబు గారికి ఎక్కడ్నుంచో వాసన తగిలినట్లుంది. మనిషి చేతిలో ఆగేటట్లు లేడు. వుండుండి. అద్దం ముందు నిలబడి ఎవరూ చూడకుండా తనలో తానే మాట్లాడుకుంటున్నాడు. ముందు ఆయనగారి భార్యగారికిదంతా చాలా చోద్యంగా అనిపించింది. నోరు తెరిచి అడుగుదామంటే - ఆ వాలకాన్ని బట్టి అగ్గగ్గలాడిపోతాడేమోనని భయం... ఆటు తర్వాత మరో అనుమానం కూడా వచ్చింది. కొంపదీసి ఏదైనా గాలి... పీడగాని సోకిందా? ఛ... ఛ.. ఆవహిస్తే ఈయనగారే ఎవడ్నయినా దొరకబుచ్చుకుని పట్టి పీడించాల్నాయె! వుహుఁ.. పోనీ... మతి చలించడం లాంటిది... కావచ్చు... కరక్టే! ఈ మధ్యన 'పార్టీ టికటో' అని హడావుడి చేసేస్తున్నాడు. ఎన్నికల్లో (వచ్చే) ఆ టికటుగాని అందకుండా పోయే వాసన తగిలి హంగామా చేస్తున్నాడా?

ఈలోపునే ఓ రోజు సాయంకాలం కుర్చీలో ఠీవిగా కాలుమీద కాలేసుకుని బాబుగారే ఒక విజయదరహాసం చేసి పారేశారు.

"ఒరె సోమయ్యా... రా... రా... నువుకూడా అట్లా కూర్చో... దాదాపు మనకు టికటు ఖాయం... టికెటే... అధికార పార్టీరా... అట్లా... అరె... అదేందిరా... అరె..."

సోయ్య ధడాల్న ఓసారి వెనక్కి విరుచుకుపడి తెప్పరిల్లాడు.

"అదేంది బావా... జనం అధికార పార్టీ అంటే ఆమడదూరం వురుకుతున్నారు - గోవిందా - సుఖం లేదు... డబ్బు హాంఫట్... ఇంకో సంగతి బావా సోమయ్యా పాక్కుంటూ బాబు చెవి దగ్గిర నోరు పెట్టాడు. కడు రహస్యంగా 'ఈ నిలబడ్డం... అధికార పార్టీ సంగతి బయటకు పొక్కితే ప్రమాదం... హమ్మో!" అని చెప్పబోయేంతలో బాబుగారు పులిలా ఓ గాండ్రింపు గాండ్రించి ఈసడించాడు.

"బద్మాష్... బామ్మర్దీ నోర్మూయ్! అసలు 'స్వర్ణాంధ్ర'ను సాధించడానికీ... ఈ రాష్ట్రం ప్రపంచంలోనే.. దేశంలో కాదు... ముందుకు ముందుకు దూసుకుపోడానికి ఏర్పాట్లు జరిగిపోయాయి. ఈ ఒక్కసారికి మీరందరు సహకరిస్తే ఇంక మన పొయ్యి మీద అన్నం పూరా వుడికిపోయి బద్దలైపోతుంది మరి!" బాబుగారు ఎగశ్వాస పీల్చాడు. భార్యా, బామ్మర్ది బిత్తరపోయి చూశారు. అట్లా ఓ అరగంట 'అభివృద్ధి' మీదా 'అసమానతల నిర్మూలన' అక్షరాస్యత - బాలకార్మికులు... ఎయిడ్స్ జాగ్రత్తలు... డ్వాక్రా మహిళలు... సి.ఎం.ఇ.వై. - చివరకు కోటి వరాలతో ముగించి ఆయాసపడిపోయాడు. భార్య మాత్రం ఈలోపు గుమ్మానికానుకుని ఓ కునుకు పీకిపారేసింది!

"ఏంటే? నేను ఇంత విలువైన విషయాలు చెప్తుంటే నీకిపుడే నిద్ర దిగదీసిందా" అని బాబుగారు మండిపడ్డాడు.

"అదేం కాదు - ఈ సోది రోజూ టీవీల్లో... పేపర్లలో చూసేదే - అదికాదు... రేపు జనం సవాలక్ష ప్రశ్నలడుగుతారు. మీరు చేయాల్సినవీ... చేయలేకపోయినవీ... వాటి సంగతులు చెప్పకుండా ఇట్లా వూరికే వూదరకు తగులుకుని లాభం ఏంటి?" అని మూతి మూడు వంకర్లు తిప్పడంతో - బాబుగారు ఛాతీ ఉబ్బరించి ఛాలెంజీకి తెగబడిపోయారు.

"సర్సరె... అడగండి - మొన్న హైద్రాబాదు మీటింగులో ఈ వెర్రిమొర్రి విమర్శలను ఎట్లా తిప్పికొట్టాలో, ఎట్లా ఎదురుదాడి చేయాలో మొత్తం అంతా ట్రయినింగై పోయింది. ఇంట్లో నాకు ప్రాక్టీసవుతుంది - ఏదీ కానివ్... కానివ్వరా... నన్ను ఏ ఏ విషయాల్లో ఎట్లా నిలదీస్తరో తగులుకోండి... నేను రెడీ... కాస్కుంటా"? అని ప్రోత్సహించాడు. అంతా పైన పట్నంలో 'బాబు'గారి ట్రయినింగేనాయె!

"బావా... కరంటు రేట్లు పిచ్చపిచ్చగా పెరిగిపాయె - మొత్తానికి మొత్తం ప్రైవేటు పవర్ ప్లాంట్లు పర్చేజయితే ఇంగబతికేదెట్లా? రైతుల మోటార్లు కాలిపోతుండె - టయానికి కరంటు లేక, వేసిన పంటలు పూరాగా ఎండిపోయి రైతన్నలు బిక్కమొహాలేస్తున్నారు గదా..."! సోమయ్య వూపిరిబిగబట్టి దట్టించాడు.

"ఉచిత విద్యుత్ కుటిల కాంగ్రెసు కుట్ర... చదువుల పండగ సందర్భంగా నేను మన రాష్ట్ర రైతులందరినీ విధిగా పాఠశాలల్లో చేర్పించి అక్షరాస్యులుగా చేస్తేగాని వాళ్ళ 'కుట్ర'ను పూర్తిగా గమనించి అధ్యయనం చేయలేరని తెలియజేసుకుంటున్నాను!" బస్!"

"నంబడం! రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు - అబ్బో రెండువేల మందాయె - చేనేత కార్మికుల పరిస్థితి కడుఘోరం - వాళ్ళకు ఎట్లాంటి ఉపాధి అవకాశాలు లేవాయె - ఎవరూ ఆదుకోడం లేదు!" భార్యగారు గాద్గికంగా అడిగింది.

"ఎయిడ్స్ వ్యాధికి మందులేదు - నివారణే తరణోపాయం - మీరు కృంగిపోవాల్సిన పనిలేదు - ఆత్మహత్యలూ అవసరం లేదు - వాళ్ళందరికీ కండోమ్‌లు విరివిగా ఎక్కడ బడితే అక్కడ... అర్థరాత్రి అపరాత్రి అనకుండా సరఫరా చేయడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం - విదేశీ సంస్థలు సహకరిస్తున్నాయి. బయోటెక్నాలజీ పార్కులో దీనికి మొదటిసారిగా వాక్సిన్ కనుగొనే ప్రయత్నంలో వున్నాం - జై జన్మభూమి!"

ఈసారి భార్యగారు చిన్న హాహాకారం లాంటిది చేశారు - సోమయ్య పండ్లు టకటక లాడించాడు. "మరి ఈ అప్పుల మాటేమిటి బావా! ప్రపంచ బ్యాంకు నుండి అరవైకోట్లు వడ్డీ (వాడు గుండెలు లవలవ బాదుకున్నాడు) ఇన్ని అప్పులు తీరేదెట్లా?"

"దీనికంతటికీ కారణం నక్సలైట్లు. వారి సిద్ధాంతాలకు కాలం చెల్లిపోయింది. తుపాకి గొట్టం ద్వారా అప్పులు రావని వాళ్ళు త్వరగా గ్రహించడం అవసరం. విధ్వంసం వల్ల ప్రజల ప్రభుత్వ ఆస్థులు నష్టపోతున్నాయి. కల్వర్టులను పేల్చితే వాటిని కట్టడానికి డబ్బు యాడ నుండి వస్తుంది. ఇట్లా విదేశీ గ్రాంటుతో రాష్ట్రం బాగా ముందుకు పోతుంది. ప్రజలు వడ్డీలు చెల్లించడంలో బాగా సహకరించాలి. నేను రోజుకు 18 గంటలు పని చేస్తున్నాను. ప్రపంచబ్యాంకు కోసం పని చేస్తున్న నన్నే పేల్చి చంపాలనుకున్నారు!'

సోమయ్య గుప్పిళ్ళ కొద్దీ జుట్టు పీక్కున్నాడు. బాబుగారు కండ్లు సగం మూసి మరీ ఢంకా బజాయించి పారేస్తున్నాడు.

"మరి మద్యం మాటేమిటి? విపరీతంగా గుడుంబా... బెల్టు షాపుల దెబ్బకు కుటుంబాలు చితికిపోతున్నాయి...

"అదంతా కాంగ్రెస్ దుష్ప్రచారం - బాల కార్మిక వ్యవస్థను మొగ్గలోనే తుంచేస్తే బెల్టు షాపుల గొడవ కొద్దిగానైనా తగ్గిపోద్ది. బాల కార్మిక నిర్మూలనకు రెండు వందల కోట్లు కేటాయిస్తున్నాను..!" దబ్బున సోమయ్య మూర్ఛపోయాడు. భార్య "ఈ ఫార్ములా రేసులేంది. ఆ 3600 కోట్లు పెట్టి దళితులకు భూములు కొనిస్తే వారు ముందుకు పోతారు గదా!"

"అక్షరాస్యతలో మనం ముందుకురకాలె - రేసులో ఎవడు గెలిచినా మళ్ళీ మేం అయిదేండ్లు పాలిస్తేనేగానీ ఈ రాష్ట్రం బాగుపడదు.

"ఎందుకు?" సోమయ్య, ఆయన అక్కా నోర్లు వెళ్ళబెట్టి విభ్రాంతిగా అడిగారు.

"ఎందుకంటే - ఎన్నో ప్రాజెక్టులు మొదలు పెట్టాం -ఎసట్లో బియ్యం పోయాలి - కింద మంటపెట్టాలి... దానికే ఎనిమిదేండ్లు పట్టింది. డ్వాక్రా గాసుందనుకో - వుడకాలి - వుమ్మగిల్లాలి. మరి దాన్లోకి కూరా... పచ్చడీ... కావాలి... మజ్జిగ.. మంచినీళ్లు"

ఆయనగారి భార్య తలబాదుకుని ఇంట్లోకి పరుగెత్తింది. బామ్మర్ది కాండ్రించి అర్జంటుగా రోడ్డు మీదికి గెంతాడు! ●

* డా॥ కె.నారాయణన్

విషాహారం పట్ల జాగ్రత్త అవసరం



ఈ రోజుల్లో ఎక్కడ చూచినా ఆహారంలో విషం కల్తీ గురించి వినిపిస్తున్నది. కొద్దిపాటి జాగ్రత్త వహించితే ఈ ప్రమాదాన్ని అరికట్టవచ్చు.

విషాహారం పాలబడిన వారిని గురించి మనం తరచూ వింటూనే ఉంటాము. ఇంచుమించు అంతే తరచుగా వచ్చే జలుబును గురించి ఎంత పట్టించుకుంటామో, ఈ విషం కల్తీ గురించి మాత్రం అంతగా పట్టించుకోము. ఎందుకంటే దీనివల్ల కలిగే ఫలితాలు చాలాకాలం నిలవవు. ఈ లక్షణాలను కేవలం ఏ అజీర్ణంగానో అనుకునే అవకాశం ఉంది కూడా!

లక్షణాలు :

విషాహారం వలన వాంతులు, భేదులు, కడుపునొప్పి వస్తాయి. ఒక్కొక్కసారి కండరాలు పట్టుకుపోవడం, అపస్మారకం కూడా రావచ్చు. చాలా సందర్భాలలో ఈ లక్షణాలు కల్తీ ఆహారాన్ని హరించుకోలేకపోయిన ఒక వ్యక్తిలో మాత్రమే కనిపిస్తాయి. మరికొన్ని సార్లు ఆ తిండి తిన్నవారందరూ ఆసుపత్రి పాలవడం, వార్తలు పత్రికల దాకా చేరడం కూడా జరుగుతుంది. పెళ్ళిళ్లు, ఇతర విందు భోజనాలలో వంట గురించి తగు జాగ్రత్త తీసుకొనకపోవడం వల్ల పెద్ద ఎత్తున ప్రమాదం జరుగుతూ ఉంటుంది.

కారణాలు :

ఆహారం విషపూరితం కావడానికి గల కారణాలేమిటి ? 1. సూక్ష్మజీవులు ఆహారంలో చేరడం, 2. పారిశ్రామిక రసాయనాలు, కీటక నాశనాలు, 3. బోటులిజమ్, 4. విషపూరితమైన పుట్టగొడుగులు, మూలికలు, 5. వ్యాధికారక శిలీంధ్రాలు (బూజులు)

విషాహారాలలో తొంభైశాతం కారణం స్టాఫిలోకోకస్ అనే బ్యాక్టీరియం. ఈ సూక్ష్మజీవులు జీర్ణకోశం లోపల ఉన్నా హాని కలిగించవు. కానీ కలుషిత ఆహారంలో మాత్రం ఇవి టాక్సిన్స్ అనే విష పదార్థాలను తయారు చేస్తాయి. ఈ విష రసాయనాలు మనుషుల కడుపులోకి చేరితే వాటి ప్రభావాన్ని చూపించగలుగుతాయి. ఫలితంగా ఇంతకుముందు చెప్పిన లక్షణాలే కాక, తీవ్రమైన సందర్భాలలో అతిసారం, డీహైడ్రేషన్ కూడా వస్తాయి.

వండిన ఆహారంలోకి ఈ సూక్ష్మజీవులు ప్రవేశించితే ఆ ఆహారాన్ని ఉపయోగించుకుని త్వరితంగా పెరుగుతాయి. సూక్ష్మజీవులు ఆహారంతో చేరడానికి మార్గాలు ఎన్నో!

- వంటకు, నిలువకు ఉపయెాగించిన పాతసామాగ్రి అపరిశుభ్రంగా ఉండడం.
- వంట చేసేవారు లేదా ఆ పదార్థాలను తాకుతున్న వారిలో పుండ్లు, గడ్డలు వంటివి వుంటే వాటిలో సూక్ష్మజీవులు ఉంటాయి. వారు తగిన పరిశుభ్రత పాటించకుండా ముట్టుకుంటే మంచి ఆహారం కూడా పాడయిపోతుంది.
- సరిగ్గా ఉడకని వంటకాలను, వెచ్చగా, తేమగా వుండే ప్రదేశాలలో వుంచితే స్టాఫిలోకోకస్ అందులో త్వరగా పెరుగుతుంది.

ఆహారం, మంచినీరు రెండూకూడా ఇతర రకాల సూక్ష్మజీవులు అంటే బాక్టీరియా, వైరస్, స్పైరోకీట్స్, ప్రోటోజోవా, నులిపురుగులు మొదలైన వాటివలన కూడా కలుషితం అవుతాయి. అయితే స్టాఫిలోకోకస్ తరువాత చెప్పుకోవలసింది, సాల్మొనెల్లా గురించి. పారాటైఫాయిడ్ కలిగించే ఈ క్రిములు అవే నేరుగా జీర్ణమండలానికి హాని కలిగించగలవు. ఎలుకలు, చుంచులు, పురుగులు, ఇతర జీవులు ఆహార పదార్థాలలో విసర్జించే మలమూత్రాల వలన సాల్మొనెల్లా విస్తరిస్తుంది. పెద్ద ఎత్తున వంటలు చేసి, ఆ పదార్థాలను కొంతకాలం నిలువ వుంచినపుడు సాల్మొనెల్లా వాటికి సోకుతుంది. ఆహారాన్ని కలుషితం చేసే మరొక బాక్టీరియం పేరు విబ్రియెా పారాహీమొలిటికస్. ఇది అపరిశుభ్రమైన నీటిలో, పీతలు, రొయ్యలు వంటి సముద్ర ఆహారంలోను వుంటుంది. గాస్ట్రో ఎంటరైటిస్‌కు ఈ సూక్ష్మజీవి కారణమంటారు.

బాక్టీరియా వలన కలిగే విషకాలుష్యంలో బోటులిజం చాలా తీవ్రమైనది. ఈ క్రిమి యొక్క స్పోర్‌లు అంటే సిద్ధబీజాలు మట్టిలో వుంటాయి. ఇవి వేడిని తట్టుకునే శక్తిగలవి. పండ్లు, కూరగాయలతో బాటు అందరూ వీటిని మింగుతూనే వుంటారు. అలాంటి సందర్భాలలో వీటివలన ఎటువంటి నష్టం వుండదు. గాలి చొరని డబ్బాలలో దాచిన ఆహారం వెచ్చగా వుంటే మాత్రం స్పోర్‌ల నుండి టాక్సిన్ విష పదార్థాలు ఉత్పత్తి జరుగుతుంది. ఇటువంటి కలుషిత ఆహారం తీసుకున్న వారికి వాంతులు, భేదులు వస్తాయి. మరొక ముప్పయి ఆరుగంటల లోపల విషం నాడీ మండలానికి చేరుకుంటుంది. అప్పుడు కనురెప్పలు బరువెక్కి కళ్ళు తెరవలేకపోవడం, ఆహారం మింగలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. బోటులిజం వలన తయారైన విషరసాయనాలు ఊహించలేనంత చిన్న మొత్తాలలో కూడా తీవ్ర ప్రభావాన్ని చూపించగలుగుతాయి. ఇవి నాగుపాము విషం కంటే కూడా ప్రమాదకరమైనవని చెప్పవచ్చు. అందుకని డబ్బాలలో సీల్ చేసి అమ్మే ఆహార పదార్థాలు ఏ మాత్రం వాసన పట్టినట్లు అనుమానం కలిగినా తినకపోవడం మంచిది.

మనిషి తను పండించుకుంటున్న ఆహార ధాన్యాల దిగుబడి పెంచే ఉద్దేశంతో రకరకాల రసాయనాలను వాడుతున్నాడు. అయితే విచిత్రమేమిటంటే - తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఆ రసాయనాలు మనిషికే హాని కలిగిస్తున్నాయి. సరైన జాగ్రత్తలు లేకుండా, అవసరానికి మించి ఈ మందులను, క్రిమికీటక నాశకాలుగా వాడుతున్నారు. మితిమీరిన ఈ విష

ఆహారంలో విషం కల్తీ జరిగినట్లు అనుమానం కలిగినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పుడు, బాధపడుతున్న వారు చిన్న పిల్లలయినప్పుడు వెంటనే జాగ్రత్త పడాలి. అంత తీవ్రంగాని సందర్భాలలో మాత్రం కడుపునొప్పి, డయేరియాలకు తీసుకొనవలసిన జాగ్రత్తలు అవలంబిస్తే చాలు.

- డీ హైడ్రేషన్ రాకుండా వేడి తేనీరు, సూప్ లాంటివి తీసుకోవాలి.
- కడుపుపైన వేడి కాపడం పెట్టడం వలన కడుపునొప్పి తగ్గుతుంది.
- బియ్యం, ఓట్స్ లాంటి ధాన్యాలతో గంజి కాచి తీసుకోవాలి. ఉడికించిన గుడ్లు, బంగాళాదుంపలు మొదలైనవి చేతనైనంత త్వరగా తినిపించాలి.
- డయేరియాను, మామూలుగా ఉంటే అరికట్టే ప్రయత్నం చేయకూడదు. అంటిబయోటిక్ మందుల వాడకం, ద్రవ ఆహారం తీసుకొనడం, చేతనైనంత విశ్రాంతి తీసుకోవడం చాలా మంచిది. విషాహారం తీసుకున్న తరువాత తీసుకునే జాగ్రత్తల కన్నా, ముందు జాగ్రత్తల వలన ఎక్కువ ఫలితాలుంటాయి. కారణాలు తెలిస్తే నివారణ మరింత సులువు.
- వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా వంటచేసే వారు మరింత జాగ్రత్త పడాలి.
- ఆహార పదార్థాలను ఎలుకలు, పురుగులు మొదలైన వాటి నుండి సురక్షితంగా దాచాలి.
- వంటకు ముందు పాత్రలను శుభ్రంగా కడగాలి. చేతులపైన పుండ్లు వున్నవారు ఆహార పదార్థాలను ముట్టుకోగూడదు.
- పాలను, నీటిని కాచిన తరువాత మాత్రమే తాగాలి. ఆహార పదార్థాలను బాగా ఉడికించాలి. మరిగే నీటిలో ఎటువంటి బ్యాక్టీరియా కూడా బతకలేదు. బాగా చల్లబరచడం వల్ల వీటి పెరుగుదల తగ్గుతుందే కాని ఇవి నశించవు. వేడి పదార్థాలను వేడిగా, చల్లని పదార్థాలను చల్లగాను ఉంచాలి. వంట గదిలోని వేడిలో తినే వస్తువులను వదిలేస్తే వాటిలో సూక్ష్మజీవులు త్వరత్వరగా పెరుగుతాయి.
- ఇంట్లోని మరుగుదొడ్లను చాలా శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఇంట్లోని రసాయనాలు, మందులు, ఫినాయిల్ వంటి వస్తువులను ఆహార వస్తువుల నుండి దూరంగా జాగ్రత్తగా ఉంచాలి.
- పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తరువాతనే వాడుకోవాలి.
- తిండిగింజలను చల్లగా, పొడిగా ఉండేచోట్ల నిలువ ఉంచాలి. లేకుంటే వాటిలో బూజు పెరుగుతుంది. బూజుపట్టిన వస్తువులను తినకూడదు.

రసాయనాలు వివిధ మార్గాల ద్వారా మన ఆహారంలోకి ప్రవేశిస్తున్నాయి. ఊహించని దుష్ఫలితాలను కలిగిస్తున్నాయి. వ్యవసాయంలో వాడుతున్న రసాయనాలను నియంత్రించడం ఎంతయినా అవసరం.

మామూలుగా వాడుతున్న చాలా మందు సీసాల మీద 'విషం' అని రాసి ఉండడం మనం గమనిస్తుంటాము. ఈ మందులు అవసరానికి మించి తీసుకుంటే విషప్రభావం కనబడుతుంది. చాలా రకాల మొక్కలు, మూలికలు, పుట్టగొడుగులలో హానికారక విష పదార్థాలు ఉంటాయి. వీటన్నిటి నుంచి రకరకాల మందులు తయారు చేస్తుంటారు. రుబార్బ్, పాలకూరలాంటి కొన్ని ఆకుకూరలలో ఆక్సాలిక్ ఆసిడ్ అనే రసాయనం ఉంటుంది. వీటిని ఎక్కువ మోతాలలో తీసుకుంటే దుష్ఫలితాలు కలుగుతాయి. అయితే అలవాటుగా వెనుకటి నుండి ఈ మొక్కలలోని విషపూరిత భాగాలను వదిలివేయడం, తక్కువగా తినడం వంటి అలవాట్లు అమలులో వున్నాయి.

మనకు అన్ని చోట్ల కనిపించే పుట్టగొడుగులలో చాలా రకాలు విషపూరితాలు. ఈ విషయం అందరికీ తెలిసే ఉంటుంది. ప్రమాదవశాత్తు ఈ రకాల పుట్టగొడుగులను తింటే ప్రమాదం వస్తుంది. తినవచ్చునని కచ్చితంగా తెలియని ఇటువంటి పదార్థాలను తినకుండా వదిలివేయడం కన్నా మంచి పద్ధతి లేదు.

బూజు మొదలైన శిలీంధ్రాల వలన తరచుగా ఆహారం విషపూరితమవుతుంది. శిలీంధ్రాలు కొన్ని సహాయకారులైతే మరికొన్ని హానికారకాలు. వీటినుండి వచ్చే పెన్సిలిన్ లాంటి మందులు ప్రాణాలను కాపాడతాయి. మనదేశంలో సర్వత్రా కనిపించే ఆస్పర్జిల్లర్ మాత్రం ప్రాణాలు తీయగలదు.

శిలీంధ్రాలు, బూజు, యీస్ట్ ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోను పెరుగుతాయి. అవి మనం పీల్చే గాలిలో, తాగే నీటిలో, నడిచే మట్టిలో, పండించే పంటలో – ఇలా అన్ని చోట్లా ఉంటాయి. అప్పుడే కోసిన పంటలో, పాతర వేసిన ధాన్యంలో కూడా శిలీంధ్రాలు ఉంటాయి. వీటివల్ల చర్మవ్యాధులు, ఇతర వ్యాధులు కూడా వస్తాయి.

ఎర్గాట్ అనేది గర్భకోశ వ్యాధులలో బాగా పని చేసే మందు. ఈ మందును ఎక్కువగా వాడడం వలన ఎర్గోటిజం అనే వ్యాధి కలుగుతుంది. దీనివలన నాళాలలో రక్తం గడ్డకట్టుకుపోతుంది. అవయవాలు పడిపోతాయి.

మనుషులలో చాలామంది దయనీయంగా అపరిశుభ్రమైన పరిసరాలలో జీవనం గడుపుతున్నారు. ఈ పరిస్థితులలో నిజానికి విషం కల్తీ మరింత ఎక్కువగా జరుగుతుందనిపిస్తుంది. విషాలకు కూడా మనుషులు అలవాటు పడి పోతారని చెప్పడం చాలా సులభమే. కానీ వారికీ అలవాటే కాని కొత్త రకం విషాలు ఎప్పటికప్పుడు పుట్టుకు వస్తాయి. వారికి ఎల్లప్పుడూ అపాయం తొంగి చూస్తుంటుంది.

అయితే పరిశుభ్రమైన పరిసరాలలో జీవిస్తున్న వారు విషం కల్తీ గురించి మరింత జాగ్రత్త వహించాలి. ఇంటి కన్నా ఆసుపత్రిలోనే అనారోగ్యం కలిగే అవకాశం ఎక్కువ.

ఎంతో పరిశుభ్రంగా, ఆరోగ్యంగా బతుకుతున్నామనుకుంటున్న వారు కూడా తమ పరిసరాలను, నేలను కలుషితం చేస్తుంటారు.

మనం అణుయుగంలో జీవిస్తున్నాము. ఈ నూతన యుగానికి చెందిన వివిధ కిరణజాలాలు మన ఆహారంలోకి ప్రవేశిస్తాయి. ఇందువలన ఎన్నో చెడు ఫలితాలు కలుగుతాయి. సహజంగానే మనుషులు అంతరిక్షం నుండి వచ్చే కాస్మిక్ కిరణాలకు, నేల నుండి వచ్చే కిరణ ధార్మికతకు గురవుతుంటారు. ఇవి కూడా మన చుట్టూ వున్న సూక్ష్మజీవులలాగే నష్టాలను కలిగిస్తాయి. అయితే సూక్ష్మజీవులలోలాగే నష్టాలను అంచనా వేయడం మాత్రం కుదరదు.

మనిషి అణ్వస్త్రాలను ఉపయోగించి ఈ నష్టాలను మరింతగా పెంచుతున్నారు. ఒక విస్ఫోటనం తరువాత రకరకాల కిరణ ధార్మిక రసాయనాలు ప్రకృతిలో చేరతాయి. ఇవి మామూలు రసాయనాల వలెనే ఉంటాయి. కానీ మనిషికి మాత్రం హాని కలిగించవు. కిరణ ధార్మికత నుండి మన ఆహారాన్ని కాపాడుకోవడం కేవలం ఒక వ్యక్తివల్లయ్యే పనికాదు.

చిన్న చిన్న జీవుల వలన ఆహారం కలుషితమై ఆ అపాయం నుంచి తప్పించుకునే మార్గాన్ని మనిషి తన తెలివితో కనుగొన్నాడు. ఆ తెలివి వలనే పుట్టిన అణుశక్తి, తత్సంబంధ కాలుష్యాన్ని మాత్రం తప్పించుకోలేకపోతున్నాడు. అందుకని ఆహారం విషయంలో జాగ్రత్త అంటే మనిషికి నిజంగా పెద్ద సమస్యే అవుతున్నది. ●

✻ బి.భాస్కర్

గాంధీజీ నాయకత్వ విశిష్టత

"గాంధీజీ వంటి అద్భుతమైన వ్యక్తి మనముందు నడయాడారన్న వాస్తవాన్ని భవిష్యత్ తరాల వారు ఆశ్చర్యచకితులవుతారు" అన్నారు ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన భారత స్వాతంత్ర్యోద్యమానికి ప్రపంచ చరిత్రలోనే విశిష్ట స్థానముంది. అంతకుముందు కొన్ని వర్గాలకే పరిమితమైన జాతీయోద్యమం గాంధీజీ ఆగమనంతో మహోజ్వల ప్రజా ఉద్యమమై ఉవ్వెత్తున ఎగిసిపడింది. బాపూజీ నాయకత్వ విశిష్టత వల్లనే అప్పటివరకు ఉన్నత తరగతుల వారికే పరిమితమైన కాంగ్రెస్ సంస్థ అనతికాలంలోనే భారతదేశంలోని అత్యధిక ప్రజానీకానికి ప్రాతినిధ్యం వహించే ఉద్యమంగా విస్తరించింది. మహాత్ముని ప్రత్యేకత ఏమిటి? ప్రముఖ చరిత్రకారుడు బిపిన్ చంద్ర రాసిన "గాంధీజీ నాయకత్వ విశిష్టత" ఈ ప్రశ్నకు సమాధానం చెప్తుంది. పలు సందర్భాలలో బిపిన్‌చంద్ర రచించిన వ్యాసాల్ని సీనియర్ సంపాదకుడు బొమ్మారెడ్డి తెలుగులో అనువాదం చేసి ముద్రించారు. నాయకుడంటే ఎవరు ? నాయకత్వ లక్షణాలేమిటి ? భారత స్వాతంత్ర్యోద్యమ సారధిగా గాంధీజీ విశిష్టత ఏమిటి? ఆయన ఉద్యమాలకు ఏ విధంగా రూపకల్పన చేశాడు ? 'అత్యధిక శాతం నిరక్షరాస్యులైన భారత ప్రజల్ని ఎలా చైతన్యవంతం చేసి ముందుకు నడిపించారు ? వంటి పలు అంశాలకు బిపిన్ చంద్ర తన వ్యాసాలలో సమాధానమిచ్చారు.

దక్షిణాఫ్రికా నుండి ఇండియా తిరిగివచ్చాక మోహన్‌దాస్ కరమ్ చంద్‌గాంధీ జాతీయోద్యమానికి అంకితం కావాలని నిర్ణయించుకున్నాడు. దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్షణకు వ్యతిరేకంగా అహింసాయుత పద్ధతుల్లో వినూత్న తరహాలో పోరాటాలు జరిపి ఆయన కొన్ని విజయాలు సాధించాడు. మహాత్ముని నిర్ణయాన్ని విని గోపాలకృష్ణ గోఖలే ఆనందించాడు. ఒక ఏడాది పాటు దేశమంతటా పర్యటించి తొలుత ప్రజల స్థితిగతుల్ని అర్థం చేసుకో అప్పుడు ఏం చేస్తే బాగుంటుందో నీకే అవగతమవుతుందని" గోఖలే గాంధీజీతో అన్నాడు. సూచనను పాటించి బాపూజీ ముందుగా దేశమంతా తిరిగాడు. వలస పాలనలో ప్రజలు అనుభవిస్తున్న దురవస్థను గమనించాడు. భిన్న మతాలు- కులాలు- సంస్కృతులు - భాషల సమాహారం భారతదేశం. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించటం తక్షణ కర్తవ్యమనీ ఆయన గుర్తించాడు. వారిలో చైతన్యం రగిలించి జాతీయోద్యమంలో పాలు పంచుకునేలా సృజనాత్మక ఆందోళనా పద్ధతులకు రూపకల్పన చేయాల్సిన అవసరాన్ని గుర్తించాడు. "సామాజిక వ్యవస్థను ప్రభావితం చేయగలవాడే నాయకుడు కాగలడని'' సామాజిక శాస్త్రవేత్తలు చెప్తారు. నాయకుడు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. వారిలో చైతన్యాన్ని నింపగలగాలి. నేత జీవితం అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలి. నిస్వార్థ సేవా పరాయణత్వం, నిరాడంబరత, సత్యనిష్ఠ, ఆదర్శవంతమైన జీవన విధానం, అహింసాయుత సత్యాగ్రహం వంటి విశిష్ట లక్షణాల కారణంగా మహాత్ముని వ్యక్తిత్వం ఆనాటి దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. వారిని స్వాతంత్ర్యోద్యమం వైపు నడిపించింది. అందువల్లనే 1920 దశకం నుండీ (అంటే గాంధీజీ ఆగమనం నుండీ) అంతకుముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ప్రజానీకం జాతీయోద్యమంలో పెద్దసంఖ్యలో పాలుపంచుకోసాగారు.



గాంధీజీ నాయకత్వ విశిష్టత

రచన : బిపిన్ చంద్ర
తెలుగు : వి.ఆర్.బొమ్మారెడ్డి
పేజీలు : 55; వెల : రు.15
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

నాయకుల రాజకీయ కార్యకలాపాలకు, ప్రజల మనోభావాలకు మధ్య సంబంధం ఉండాలనేది గాంధీజీ అభిప్రాయం. బలమైన నాయకత్వం, ప్రజాస్వామికంగా వ్యవహరించటం, కార్యకర్తల విశ్వాసం, క్రమశిక్షణ, అంచెలంచెలుగా నాయకత్వ వికేంద్రీకరణ లేకుండా ఎవరూ కూడా పటిష్టమైన ఉద్యమాన్ని నిర్మించలేరని మహాత్ముడు చెప్తారు. సృజనాత్మక కార్యక్రమాలు, కొత్తతరం నాయకుల ఎదుగుదలకు అవకాశం కల్పించటం, మొండితనానికి బదులు పట్టువిడుపులుండటం, యువతకు పెద్దపీట వేయటం, గ్రామస్థాయి వరకు శక్తివంతమైన నేతల్ని తయారు చేయటం ద్వారానే బాపూజీ స్వాతంత్ర్యోద్యమాన్ని విస్తృత ప్రజాందోళనగా మలచగలిగాడు. "సమానత్వమనేది మహాత్ముని సిద్ధాంతాలలో కీలకమైనది. నాయకునికి - జనానికి మధ్య ఉండాల్సిన సంబంధ మూలాల్ని ఆయన అర్థం చేసుకున్నంతగా మరెవరూ అవగతపర్చుకోలేదు" అంటారు ప్రొఫెసర్ బిపిన్‌చంద్ర ప్రజల్ని సంసిద్ధుల్ని చేసిన అనంతరమే గాంధీజీ ఉద్యమాల్ని ప్రారంభించే వాడని, అదే ఆయన విజయ రహస్యమని బిపిన్‌చంద్ర విశ్లేషించారు. "పురోగామి దిశలో బాపూజీ భావాలు నిరంతరం అభివృద్ధి చెందుతూ వచ్చాయి. ఆయన నిరంతర సత్యాన్వేషి, ప్రజలందర్నీ ఏకతాటిపై నడిపిన సమరశీల ఆందోళనకారుడు మహాత్ముడు" అంటూ ప్రొఫెసర్, గాంధీజీ విశిష్టతను వివరించారు. అందువల్లనే "ప్రజాసేవ-దేశసేవ చేయాలన్న సంకల్పం తనకు గాంధీజీ రచనల స్ఫూర్తితోనే కలిగిందని", పుచ్చలపల్లి సుందరయ్య చెప్పారు. ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమిది. గాంధీజీ నాయకత్వ విశిష్టతను వివరించే ఈ పుస్తకాన్ని తెలుగులో తీసుకువచ్చిన బొమ్మారెడ్డిగారిని అభినందించాలి. ●

స్వీకారం



గోగుపూలు

రచన : పోలాడి లింగారావు
వెల : రు.20/-; ప్రతులకు : డా॥ జి.లక్ష్మణరావు, ఇ.నెం.10-3-363, వివేకానందపురి, కరీంనగర్; పోలాడి లింగారావు, ఇ.నెం.9-4-105, శ్రీనగర్ కాలనీ, కరీంనగర్; విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

పర్యాటకులను ఆకట్టుకునే కరీంనగర్

గోదావరి నదీ తీరాన విలసిల్లిన వైదిక నాగరికతకు, పురాతన ఆలయాలకు, బౌద్ధ నాగరికతకు, చారిత్రక దుర్గాలకు, దట్టమైన అడవులకు కరీంనగర్ జిల్లా ప్రసిద్ధి చెందింది. వేములవాడలోని రాజరాజేశ్వర ఆలయం, కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయం చాలా ప్రసిద్ధి చెందాయి. మొత్తం మీద కరీంనగర్ జిల్లా పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

నాగునూరు కోట

కాకతీయుల కాలం నాటి నాగునూరు కోట ఆనాటి చక్రవర్తుల పరాక్రమాన్ని తెలియచేస్తోంది. కరీంనగర్ పట్టణానికి కేవలం



ఎనిమిది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న ఈ కోట కాకతీయుల కాలంలో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. నేడు మాత్రం శిథిలావస్థలో ఉంది. కోటలో ఉన్న శివాలయంలోని శిల్పాలు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. రాతి స్తంభాలపై చెక్కిన శిల్పాల్లో సంగీత విద్వాంసులు, నాట్యకత్తెలు సజీవంగా కనిపిస్తారు.

మంథని

కరీంనగర్ పట్టణానికి 70 కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరాన గల ఈ గ్రామం ప్రాచీన కాలంలో వేదాలు నేర్పింది. ఎంతోమంది పండితులు, వేదాంతులు ఇక్కడ తయారయ్యారు. దీని చుట్టుపక్కల ఎన్నో ఆలయాలు వెలిశాయి. వైదిక నాగరికతకు ఎంత ప్రసిద్ధి చెందిందో తర్వాతి కాలంలో బౌద్ధ, జైన నాగరికతలను మంథని అంతగానూ ఆదరించింది.

వేములవాడ

క్రీస్తుశకం ఎనిమిదవ శతాబ్దంలో చలుక వంశ రాజులు నిర్మించిన రాజరాజేశ్వర ఆలయం వేములవాడకు ఎంతో పేరు తెచ్చింది. ఆలయ సముదాయంలో ఇంకా అనేకమంది దేవతలు కూడా కొలువు తీరారు. అన్నింటికంటే ఆశ్చర్యం గొలిపే అంశం ఆలయ సముదాయంలో ముస్లిం దర్గా నిర్మాణం. ఈ దర్గాకు కుల, మతాలతో నిమిత్తం లేకుండా అందరూ హాజరవుతారు. ఆలయ నిర్వాహకులు యాత్రికుల సౌకర్యార్థం 400 గదులతో వసతి ఏర్పాట్లు చేశారు.

కాళేశ్వరం

కరీంనగర్ పట్టణానికి 130 కిలోమీటర్ల దూరంలో, మంథనికి 32 కిలోమీటర్ల దూరంలోని కాళేశ్వరంలో గల ముక్తేశ్వర ఆలయం చాలా ప్రాచీనమైనది. ప్రాణహిత గోదావరిలో కలిసే ప్రాంతాన దట్టమైన అడవుల మధ్యన గల కాళేశ్వరం అందమైన పర్యాటక ప్రదేశం. ఈ ఆలయంలో ఎంతో అరుదుగా కనిపించే రెండు శివలింగాలు ఉంటాయి. అవి ఒకే పీఠంపై ఉండటమే విశేషం. దేశంలో అతి తక్కువగా కనిపించే బ్రహ్మ దేవుడు కూడా ఈ ఆలయంలో కొలువుతీరి ఉండటం మరో విశేషం.

వన్యమృగ సంరక్షణ ప్రాంతం

మంథనికి పది కిలోమీటర్ల దూరంలో 37 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో శివరాం వన్యమృగ సంరక్షణ ప్రదేశం ఉంది. ఇక్కడి గోదావరిలో మొసళ్ళు బాగా ఉంటాయి. చిరుతలు, ఎలుగులు, కృష్ణజింకలు, కొండచిలువలు వంటి ఎన్నో అడవి జంతువులను చూడవచ్చు. ఈ అడవి చూడాలంటే డిసెంబర్ నుండి ఏప్రిల్ మధ్య కాలం అనువైంది.

కరీంనగర్‌కు ఇరవై కిలోమీటర్ల దూరంలోని ధూలికట్ట జిల్లాలోని ఏకైక బౌద్ధారామం. శాతవాహనుల కాలంలోని అనేక బౌద్ధ స్తూపాలు ఇక్కడ బయటపడ్డాయి. ప్రతిఏటా జనవరి మాసంలో ఇక్కడ మూడురోజులపాటు శాతవాహన ఉత్సవాలు నిర్వహిస్తారు. కరీంనగర్ పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో గల ఎలిగండల్ కోట తెలంగాణాకు రాజధానిగా విలసిల్లింది. ఈకోట నుండి కాకతీయులు, బహమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, మొగలులు, అసిఫ్‌జాహీలు పరిపాలన సాగించారు. ఈ కోటలో అనేకమంది ముస్లిం బోధకుల సమాధులు ఉన్నాయి.

లోహకళ

వివిధ లోహాలతో అందమైన బొమ్మలు తయారీలో కరీంనగర్ పట్టణం ఎంతో ప్రసిద్ధి



చెందింది. వెండి షీట్లపై అందమైన నగిషీలు చెక్కుతారు. వెండిని పోతపోసి అనేక రకాల బొమ్మలు తయారు చేయడంలో కరీంనగర్‌లోని కళాకారులు ఎంతో పేరు పొందారు. రకరకాల పక్షులు, చార్మినార్, నగల పెట్టెలు, వింజామరలు, పుష్పాలను వెండితో తయారు చేయడంలో వీరు ఎంతో నేర్పరులు. కరీంనగర్‌కు వచ్చే పర్యాటకులకు ఇవి ప్రత్యేక ఆకర్షణ. ●

* హెచ్.రమేష్ బాబు

దక్షిణ భారత సినీ రంగంలో తెలుగులో ఎన్.టి.ఆర్., అక్కినేని, తమిళంలో ఎం.జి.ఆర్, శివాజీ గణేషన్‌లు మహానటులైతే కన్నడంలో మాత్రం ఒక్క రాజ్‌కుమార్ మాత్రమే మహానటుడు. సినీ రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాకరమైన ఎన్.టి.ఆర్. జాతీయ అవార్డును రాజ్‌కుమార్‌కు ప్రకటించింది.

మహానట కంఠీరవ రాజ్‌కుమార్

రాజ్‌కుమార్‌ది అయిదు దశాబ్దాల పాటు సినీరంగంలో పండిన జీవితం. 1929 ఏప్రిల్ 24న తమిళనాడు దగ్గరలోని దొడ్డగజనూరులో జన్మించిన రాజకుమార్ కుటుంబం నాటక రంగానికి చెందినది. 'గుబ్బివీరణ్ణ' నాటక కంపెనీలో రాజ్‌కుమార్ తండ్రి వేషాలు వేసేవాడు. చదువుకోసం బడికి వెళ్ళినా రాజ్ ధ్యాస అంతా నటన మీదే ఉండేది. దాంతో అయిదో తరగతిలోనే చదువుకు స్వస్తి పలికి తరచూ ఇంట్లో జరిగే నాటకాల రిహార్సల్స్‌లో పాల్గొనే వారు. అలా గుబ్బివీరణ్ణ కంపెనీలోనే వేషాలు వేయనారంభించాడాయన. మొదట్లో చెలికత్తె, సేవకుడు, నర్తకి వేషాలు వేశారు. 18వ ఏట కురుక్షేత్రంలో కుంతీదేవి పాత్రలో మంచిపేరు తెచ్చుకున్నారు. తరువాత మైసూర్‌లోనే ఉండే ఎం.వి.సుబ్బయ్య నాయుడు, రాజ్ ప్రతిభను గుర్తించి తమ కంపెనీలోకి ఆహ్వానించి నాయకపాత్రలు ఇచ్చారు. రంగస్థలంపై రాజ్ ఎదుగుదలను గుర్తించిన రాజ్ తండ్రి తన కొడుకును సినిమాల్లో నటింపచేయాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతలో మాతృసంస్థ గుబ్బివీరణ్ణ కంపెనీ నుండి తాము తీస్తున్న "బేడరకణ్ణప్ప" కోసం మేకప్ టెస్టుకు రమ్మని కబురు వచ్చింది. చివరికి ఆ పాత్రకు ఆయనే ఎంపికైనారు. అయితే అప్పటిదాకా వున్న 'ముత్తురాజ్' పేరును బేడర కణ్ణప్ప దర్శకుడు హెచ్.ఎల్.సిన్హా 'రాజ్‌కుమార్'గా మార్చాడు.

1954లో రాజ్‌కుమార్ నటించిన 'బేడర కణ్ణప్ప' విడుదలై కర్ణాటక అంతా విజయభేరి మోగించింది. కన్నడ సినీ చరిత్రలో మైలు రాయిగా నిలిచిపోవడమే గాక రాష్ట్రపతి అవార్డు అందుకున్న తొలి కన్నడ చిత్రం అయింది. ఇంతగా సంచలనం సృష్టించిన ఈ చిత్రాన్ని తమిళంలోకి డబ్ చేయడమే గాక తెలుగులో రీషూట్ చేసి 'కాళహస్తి మహాత్మ్యం'గా 1954లోనే విడుదల చేశారు. తెలుగులోనూ బాగా ఆడింది.

బేడరకణ్ణప్ప విజయం తరువాత కన్నడంలో రాజ్‌కుమార్ ఫాలోయింగ్‌ని దృష్టిలో ఉంచుకుని వరుసగా పౌరాణికాలను చేసి విజయం సాధించారు. అయితే రాజ్ కేవలం పౌరాణికాలకే పనికి వస్తాడని, సాంఘికాలకు సరిపోడనే విమర్శలు వచ్చాయి. దాంతో వందరీబాయి తీసిన 'రాయరసొసె' అనే సాంఘిక చిత్రంలో హీరోగా చేసి అందరినోళ్ళు మూయించాడు. కానీ ఆయన నటన, నడక అన్నీ జానపద, పౌరాణికాలను పోలి వున్నాయన్నారు. తర్వాతి చిత్రం 'కన్యారత్న'తో ఈ పొరపాట్లు సరిదిద్దుకున్నారు. అప్పటి నుండి రాజ్‌కుమార్ సినీ జైత్రయాత్ర మొదలై దశాబ్దాల తరబడి కొనసాగింది. తరువాత జేమ్స్‌బాండ్ చిత్రాల్లో సైతం నటించి మెప్పించారు. నటుడిగానే కాక గాయకుడిగా కూడా తన పాటలు తాను పాడుకోవడమే గాక, ఒక చిత్రంలో గాయకుడైన ఎస్.పి.బాలుకు సైతం ప్లేబ్యాక్ పాడిన ఘనతను దక్కించుకున్నారు.

రాజ్‌కుమార్ 1960లో జి.వి.అయ్యర్,

ఎన్నికల అటెన్షన్

తెలుగువీర లేవరా
జాతిహితం కోరరా
చంద్రబాబు పాలనకు
చరమ గీతం పాడరా
అన్నపూర్ణ రాష్ట్రానికి
అన్నదాత ఆధారం
ఆకలిమంటలు ఆత్మహత్యలతో
సాగుతోంది వర్తమానం
జీవనోపాధికి లేదు సహకారం
కరువును తీర్చేందుకు
పిసరంత ప్రణాళిక లేదు
క్రీడలు జరిపేందుకు
అంబరాన్నంటే సంబరాలు
బాబు అవినీతి ఏలేరు కాల్వలో
గలగలమని పారింది
నకిలీ స్టాంపుల రూపంలో
ముప్పది రాష్ట్రాలకు సాగింది
ఎనిమిది వసంతాల పాలన
వరల్డ్ బ్యాంకుకు 'శ్రమదానం'
ఆకలి మంటలు ఆత్మహత్యలు
రాష్ట్ర ప్రజలకు 'బహుమానం'
బాబు ఆదర్శం
చీకటిలో నల్లపిల్లి
వెలుగులో ఊసరవెల్లిరా
నయవంచనకు మారుపేరురా
స్వర్ణాంధ్ర ఆశయం
మెరుస్తున్న మేడిపండురా
పొట్టవిప్పి చూస్తే
తెగబలిసిన 'పచ్చ'తిమింగలాలురా
కోటివరాల మాటకు మురిసిపోవద్దు
ఎన్నికల గేలానికి చిక్కొద్దు
చీప్‌లిక్కర్ ఊబిలో దిగిపోవద్దు
వేస్తున్న పునాదిరాళ్లకు సమాధి కావద్దు

నరసింహరాజు, బాలకృష్ణ తదితరులతో కలిసి 'కన్నడ చిత్రకళావిశారద సంఘ్' అనే సంస్థను ప్రారంభించి సహకార పద్ధతిలో మైసూరు పాలించిన రాజులలో ప్రసిద్ధుడైన 'రణదీవకంఠీరవ' జీవితంపై అదే పేరుతో చారిత్రక చిత్రాన్ని రూపొందించి టైటిల్ రోల్‌లో నటించారాయన. ఆర్థికంగా ఈ చిత్రం విజయం పొందడంతో తరువాత మరికొన్ని చిత్రాలు నిర్మించారు వీరు.

'బేడర కణ్ణప్ప' తరువాత రాజ్‌కుమార్ నటించిన మరో పౌరాణికం 'సత్యహరిశ్చంద్ర' కూడా రాష్ట్రపతి అవార్డు అందుకున్నది. 'నాంది' అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో పాల్గొంది. 1972లో విడుదలైన 'బంగారు మనుష్య' ఏకబిగిన వందవారాలు బెంగుళూరులోని ఒక థియేటర్‌లో ప్రదర్శితమై రికార్డు స్థాపించింది. తెలుగులో ఎన్టీఆర్ లాగే మహిషాసుర మర్దినిలో మహిషునిగా, భూకైలాస్, 'దశావతారాలు'లో రావణుడిగా నెగెటివ్ రోల్స్‌ని అత్యద్భుతంగా పోషించి మెప్పించారు. తుకారాం, కనల్‌దాస, రాఘవేంద్ర వంటి భక్తి యోగుల పాత్రలను చేసి చూపారు.

రాజ్‌కుమార్ నూరవ చిత్రం 'భాగ్యరభాగిలు' విడుదలైనపుడు ఆయన అభిమానులు బెంగుళూరులో ఒక పెద్ద ఉత్సవాన్ని ఏర్పాటు చేసి ఏనుగుపై ఊరేగించాలని సంకల్పించగానే ఆయన వినమ్రంగానే తిరస్కరించారు. ఇది రాజ్ నిరాడంబరత్వానికి నిదర్శనం. ఇదే చిత్రం శతదినోత్సవ సభ కంఠీరవ స్టేడియంలో జరిగినపుడుమూడు లక్షల మంది అభిమానుల సమక్షంలో రాజ్ సినిమా రంగానికి పరిచయం చేసిన గుబ్బివీరణ్ణగారే 'నటసార్వభౌమ' బిరుదుతో సత్కరించారు. ఇంకా ఆయనకు ప్రభుత్వ బహుమతి తెచ్చి పెట్టిన చిత్రం బంగారు హువు. ఈ చిత్రం ద్వారా ఉత్తమ నటుడిగా ఎంపికైనారు. ఇంకా అనేక చిత్రాలు రాష్ట్ర, జాతీయ అవార్డులు పొందాయి.



ఎన్.టి.ఆర్., ఏ.ఎన్.ఆర్.లతో రాజ్‌కుమార్

1997లో రాజకుమార్ తన 68వ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న సందర్భం. అప్పటికే కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారాయన. అయితే ఈ ఉత్సవాలకు వచ్చిన అభిమాని ఒకరు రాజ్ కళ్ళముందే తన తలపై కొబ్బరికాయను పగులకొట్టుకొని, తీవ్రంగా రక్తం కారుతుండగా 'అన్నగారు ఈ ఏడాది నటిస్తానంటే తప్ప గాయానికి చికిత్స చేయించుకోన''ని మొండికేయడంతో తప్పనిసరైన పరిస్థితిలో ఆయన సరేనని వాగ్దానం చేశారు. ఆ మాటకు కట్టుబడి నటించిన చిత్రం 'శబ్దవేది'.

తెనాలి రామకృష్ణ (1956), భూకైలాస్ (1958), భూదాన్ (1963), పేకేటి శివరాం దర్శకత్వం వహించిన చక్రతీర్థ (1967), ఉయ్యాలే (1969), తరువాత నాగార్జున (1972), శ్రీకృష్ణదేవరాయ, భక్త సంతోబా, మంత్రాలయ మహాత్మ్యం, చందాయపల్లితోట, గృహలక్ష్మి, కవిరత్న కాళిదాసు, మమతయే బంధన, చిక్కమ్మ, దారితప్పిన మగ, హణ్ణిలేబి గురుదాక, జీవనచైత్ర, హుణ్ణొందు గండారు వంటి 207 సినిమాల్లో నటించారాయన.

రాజ్ తన సినీ జీవితంలో అందుకున్న అవార్డులు, పొందిన సన్మానాలు లెక్కకు మించినవి. కన్నడ కంఠీరవ, కన్నడ రత్న, కళాశిఖర, మైసూరు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ జీవనయాత్ర చిత్రానికి ఉత్తమ గాయకునిగా జాతీయ అవార్డు 'పద్మభూషణ్', 1996లో అత్యున్నత భారత ప్రభుత్వ దాదాఫాల్కే అవార్డు, ఇదే సంవత్సరం కర్నాటక రత్న, ఇప్పుడు 'ఎన్.టి.ఆర్. జాతీయ అవార్డు' ఆయన్ను వరించి తమ గౌరవాన్ని పెంచుకోనుంది. ఈ అవార్డు కింద అయిదు లక్షల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారు. రాజ్ శ్రీమతి పార్వతమ్మ నిర్మాతగా 45 చిత్రాలు నిర్మించగా ఆయన ముగ్గురు కొడుకులూ కన్నడంలో హీరోలుగా కొనసాగుతున్నారు.

తన ఇన్నేళ్ళ కెరీర్‌లో రాజ్ ఎన్నడూ వివాదాల్లోకి రాలేదు. తన పారితోషికాన్ని పెంచుకోవాలన్నా నిర్మాతల అంగీకారంతోనే పెంచుకునే వారు. కాగా 2000 ఆగస్టులో ఆయన్ను అడవిదొంగ వీరప్పన్ కిడ్నాప్ చేసి 108 రోజులు బందీగా ఉంచుకున్నాడు. దాంతో కన్నడ పరిశ్రమ స్తంభించిపోయింది. చివరికి నవంబర్ 12న విడుదల చేయడంతో కథ సుఖాంతమైంది. రాజ్ ఎన్టీఆర్ నటనను ఆదర్శంగా తీసుకున్నారు. అందుకే మంజునాథ చిత్ర ప్రారంభోత్సవానికి వచ్చినపుడు 'తనకు పౌరాణిక పాత్రల విషయంలో ఎన్టీఆర్ నటనే ప్రేరణ' అని చెప్పుకున్నారు.

రాజ్ భారతీయ చిత్ర రంగంలో మహానటులన్న వారిలో ఒకరిగా 'ఉన్నతంగా ఎదిగినా' ఇవాళ చలన చిత్ర రంగంలో నటునిగా నేను సాధించింది చూసే వారికి గొప్పగా అనిపించవచ్చుగానీ నా దృష్టిలో ఇది సామాన్యమైనది. నేను సాధించవలసింది ఎంతో ఉన్నది' అని తనను తాను సామాన్యునిగా చాటుకుంటారు. అంతటి సమున్నతుడిని ఎన్.టి.ఆర్. అవార్డుతో గౌరవిస్తుండటం సంతోషకరం. ●

వేర్పాటు వాదానికి సహకరించవద్దు
ప్రత్యేక తెలంగాణాకు స్వస్తి చెప్పరా
సమైక్య ఆంధ్రావని నిలబెట్టు
తెలుగుతల్లి క్షుద్బాధను నివారించరా
విశాలాంధ్రలో ప్రజారాజ్యం సాధన
ఈ నాటిది కాదురా...
ఉద్యమాల ఊపిరితో
సాధించిన ప్రగతిరా
సస్యశ్యామల దేశంలో
ఆకలి రాజ్యం సృష్టించిన
తెలుగుదేశం బిజెపిలను
ఓడించగా...
శంఖారావం పూరించి
సంస్కరణలు చేస్తున్న 'దోపిడి'పై
పాదయాత్ర చేయరా
నీ ఓటు ఆయుధంతో...
చిత్తు చేయరా

-ఎమ్.నరసింగరావు

ADVOCATE

న్యాయ సలహాలు

నిబంధనలు ఉల్లంఘించారు

పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో జరిగిన అవకతవకల వల్ల నాకు ఉద్యోగం రాలేదు. ఎస్‌సిలకు రిజర్వు చేసిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసినవారిలో నేనే ప్రథముడిగా నిలిచాను. కాని నాకు ఉద్యోగం ఇవ్వకుండా వేరే సబ్‌డివిజన్ నుండి ఓసికి చెందిన వ్యక్తిని బదిలీపై తెచ్చి ఎస్‌సికి రిజర్వు చేసిన పోస్ట్‌లో నియమించారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఉద్యోగాల్లో బదిలీలు లేవు. ఈ రెండు నిబంధనలు అతిక్రమించి అధికారులు వ్యవహరించారు. నేను ఈ విషయాన్ని నంద్యాల సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ వారికి చెప్పగా ఈసారి వేకెన్సీలు పడినపుడు దరఖాస్తు చేయాల్సిందిగా సలహా ఇచ్చారు. నేను బీద నిరుద్యోగిని. అర్హతలు కలిగిన నాకు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఉద్యోగం వచ్చే విధానం తెలియచేయగలరు.

బి. కోటయ్య బి.కాం.,
ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా

మీరు తప్పనిసరిగా ఈ సమస్య మీద కోర్టుకు వెళ్ళవలసి ఉంటుంది. హైదరాబాద్‌లో గల సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేస్తే వారు విచారించి తప్పనిసరిగా మీకు న్యాయం చేస్తారు. ఈ కార్యాలయం హైదరాబాద్‌లో పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా గల హాకాభవన్‌లో ఉంది. ఒక పోస్ట్‌ని నోటిఫై చేసిన తర్వాత దానికి అనుగుణంగానే ఖాళీని భర్తీ చేయవలసి ఉంటుంది. ఆ నోటిఫికేషన్‌కు భిన్నంగా నియామకం చేస్తే అది చెల్లదు. కాబట్టి పైన పేర్కొన్న ట్రిబ్యునల్‌ను మీకు తెలిసిన న్యాయవాది ద్వారా ఆశ్రయించండి.

జీతం కోసం అవస్థలు

మా నాన్నగారు 1998 సంవత్సరంలో ఘుడియపూడి గ్రామంలోని అన్నాబత్తిన సుబ్బారావు పొగాకు బేర్నీకి డ్రైవర్‌గా 4 నెలల పాటు రు.5,500ల ఒప్పందంతో పని చేశారు. ఆ బేర్నీ వాస్తవ యజమాని శరాబంది నుండి అన్నాబత్తిన సుబ్బారావు అద్దెకు తీసుకున్నారు.

మా నాన్నగారు పని చేసిన తర్వాత అన్నాబత్తిన సుబ్బారావు గారు ఒప్పందం పైకం ఇవ్వకుండా మోసం చేశారు. మా నాన్నగారు అన్నాబత్తిన సుబ్బారావుపై కేసు వేశారు. సంవత్సరంలో బేర్నీ వాస్తవ యజమాని అయిన శరాబందిపై కోర్టు నోటీసు పంపించడం జరిగింది. ఆయన మాకు ఏ మాత్రం సహకరించలేదు. మా నాన్నగారితో గొడవ పడ్డాడు. తర్వాత శరాబంది తన పర్సనల్ లాయర్ ద్వారా కోర్టు నోటీస్‌ను తిప్పి పంపించారని మాకు తెలిసింది. మా నాన్నగారు ఎ.ఎల్.సి.గారి ఆఫీస్ చుట్టూ తిరిగినప్పటికీ కేసు కొంచెం కూడా ముందుకు కదలడం లేదు.

అయితే 2002 సంవత్సరంలో మా నాన్నగారితో ఎ.ఎల్.సి. ఆఫీసు వారు కింది విధంగా చెప్పడం జరిగింది.

"జడ్జిగారు పెండింగ్ ఫైల్స్ లిస్టు చూశారు. వాటిలో మీ కేసు కూడా ఉంది. మీ కేసుపై ఎంక్వయిరీకి కలెక్టర్‌గారి ఆఫీస్‌కి నోటీస్ పంపించడం జరిగింది. కలెక్టర్ గారు ఎం.ఆర్.ఓ.గార్కి నోటీస్ పంపించి కేసు పూర్తి వివరాలతో ఆర్డర్ తయారు చేసి ఎ.ఎల్.సి. ఆఫీస్‌కి పంపించినట్లయితే కేసు పూర్తి అవుతుంది" అని చెప్పారు.

మా నాన్నగారు కేసు గూర్చి కలెక్టర్ ఆఫీస్ వారిని అడిగితే వాళ్ళు ఆ రిపోర్టును ఎం.ఆర్.ఓ. గారి ఆఫీస్‌కి పంపించడం జరిగిందని చెప్తున్నారు. మరలా ఎం.ఆర్.ఓ. ఆఫీస్ వాళ్ళని అడిగితే కలెక్టర్ ఆఫీస్‌కి పంపించడం జరిగిందని చెప్తున్నారు. అసలు ఆ రిపోర్ట్ ఎక్కడ వుందో తెలియడం లేదు. అలా ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ ఈ రోజు వరకు కూడా కేసు అసంపూర్తిగా మిగిల్చి వేశారు.

మా నాన్నగారు ఈ 5 సంవత్సరాల కాలంలో ఎన్నో సార్లు అన్ని ఆఫీస్‌ల చుట్టు తిరిగారు. కేసు గూర్చి అడిగిన ప్రతిసారీ ప్రతి ఆఫీస్‌లోనూ బల్ల కింద వ్యవహారాలు. మాకు న్యాయం జరగాలంటే మేము ఏం చేయాలి? మీ సలహా కోసం ఎదురు చూస్తూ....

– కె.వెంకట రమణ, ఒంగోలు.

మీ నాన్నగారి సమస్యకు సంబంధించినంత వరకు న్యాయం జరగడానికి ఇప్పటికే ఆలస్యం జరిగింది. ఆ దరఖాస్తును ఇంతకాలం పెండింగ్‌లో ఉంచడం సరైంది కాదు. రాత పూర్వకంగా మరోసారి మీ నాన్నగారి చేత తన సమస్య పరిష్కరించవలసిందిగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు రిక్వెస్ట్ పిటిషన్ ఇప్పించండి. నెల రోజులు చూసిన తర్వాత అప్పటికీ పరిష్కారం కాకపోతే హైకోర్టును ఆశ్రయించవలసి ఉంటుంది. హైకోర్టు మీ కేసును పరిశీలించి ఎఎల్‌సికి ఆదేశాలు జారీ చేయడమో లేక తానే మీనాన్నగారికి అనుకూలంగా తీర్పు ఇవ్వడమో చేస్తుంది.

బస్ కాంప్లెక్స్‌కు మా గ్రామం పేరు పెట్టాలి

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామ పంచాయితీ, బలిఘట్టం రెవెన్యూ గ్రామంలో నర్సీపట్నం బస్ డిపో, బస్‌కాంప్లెక్స్ వుంది. ఆ ఆర్.టి.సి. బస్ కాంప్లెక్స్, బస్ డిపోనే, నర్సీపట్నం బస్సు డిపో, కాంప్లెక్స్ అని పిలుస్తున్నారు. కాని బలిఘట్టం బస్‌డిపో, కాంప్లెక్స్ అని పేరు పెట్టలేదు. రాయుట లేదు. బలిఘట్టం ఆర్.టి.సి. డిపో, కాంప్లెక్స్ అని పిలవాలంటే ఏమి చేయాలి. కోర్టుకు వెళ్ళాలా? ఏ అధికారులకు తెలిపినా బలిఘట్టంగా మార్పు చేయలేదు. మీరు సలహా ఇవ్వగలరు.

– శెట్టి శాంతి లక్ష్మిబాయ్, సర్పంచ్,
బలిఘట్టం, నర్సీపట్నం మండలం,
విశాఖపట్నం జిల్లా.

నర్సీపట్నం బస్‌డిపో లేదా కాంప్లెక్స్ మీ గ్రామంలో ఉన్నంత మాత్రాన ఆ గ్రామం పేరు పెట్టాలనే నిబంధన లేదు. ఆర్టీసి వారి పాలనాసౌలభ్యం కోసం వారి డిపోకి పేరు పెట్టుకోవచ్చు. ఫలానా ఊరిపేరే పెట్టాలని మీరు కోర్టుకు వెళ్ళడానికి వీలులేదు. అయితే ఈ స్థలం గ్రామపంచాయితీదా లేదా ఎవరిదైనా వ్యక్తిగత స్థలాన్ని ఆర్టీసి తీసుకుందా అనే విషయాన్ని మీరు ఉత్తరంలో తెలుపలేదు. ఒక వేళ పంచాయతీ స్థలం అయివుండి ఆర్టీసి వారికి స్వాధీనం చేసేటపుడు డిపో లేదా కాంప్లెక్స్‌కు మీ గ్రామం పేరే పెట్టాలని నిబంధన పెట్టి ఉన్నట్లయితే మీరు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళండి. ముందు చెప్పినట్లుగా ఫలానా ఊరు పేరే పెట్టాలని డిమాండ్ చేసే హక్కు గ్రామపంచాయితీకి లేదు.

– ఎ.సత్యప్రసాద్,
హైకోర్టు న్యాయవాది

పాలకూర పూరీలు

కావలసిన వస్తువులు:

మైదా: రెండు కప్పులు
బొంబాయి రవ్వ: ముప్పావు కప్పు
పాలకూర: సన్నగా తరిగింది ముప్పావు కప్పు
ఉప్పు: తగినంత
జీలకర్ర: అర టేబుల్ స్పూను
నెయ్యి: మూడు టేబుల్ స్పూన్లు
బంగాళాదుంపలు: రెండు ఉడికించినవి
పుల్లటి పెరుగు: మూడు టేబుల్ స్పూన్లు
తినే షోడా: అర టేబుల్ స్పూన్
నూనె: పూరీలు వేయించేందుకు

చేసే పద్ధతి:

ఉడికించిన బంగాళాదుంపలను మెత్తగా చిదపాలి. మైదా, బొంబాయి రవ్వ, పెరుగు, ఉప్పు, పాలకూర, షోడా, నెయ్యి, బంగాళా దుంపను తగినన్ని నీటితో పూరీ పిండిలా కలుపుకోవాలి. దీనిపై పల్చటి గుడ్డను కప్పి ఓ గంటసేపు ఉంచాలి. ఆ పిండితో పూరీలు చేసి లేలికపాటి బంగారు రంగులోకి వచ్చేలా కాల్చాలి. వీటిని బొంబాయి శనగలు, మెంతి కూరతో వడ్డించాలి.

బొంబాయి శనగలు, మెంతికూర

కావలసిన వస్తువులు:

బొంబాయి శనగలు: 200 గ్రాములు
మెంతి కూర: రెండు కట్టలు
నూనె: 4 టేబుల్ స్పూన్లు
కారం: ఒకటిన్నర స్పూను
జీలకర్ర: రెండు టేబుల్ స్పూన్లు
గరం మసాలా: 1 టేబుల్ స్పూన్
ఉప్పు: తగినంత

చేసే విధానం:

బొంబాయి శనగలను రాత్రి నానబెట్టుకోవాలి. శనగలు మెత్తగా అయ్యేలా కుక్కర్‌లో ఉడికించాలి. అందులోని నీటిని వంచి పక్కన ఉంచాలి. మెంతికూర ఆకులను కోసి సన్నగా తరగాలి. జీలకర్రను వేయించి పొడిచేసి ఉంచాలి. బాణలిలో నూనె వేసి మెంతికూరను వేయాలి. దానిమీద మూత పెట్టి మూడు, నాలుగు నిముషాలు ఉడికించాలి. గరం మసాలా మినహా మిగతా పొడులను అందులో వేసి రెండు టేబుల్ స్పూన్ల నీరు పోసి రెండుమూడు నిముషాలు ఉడికించాలి. ఇప్పుడు ఉడకబెట్టి ఉంచిన శనగలను అందులో వేసి నెమ్మదిగా కలపాలి. శనగల్లోంచి వంపిన నీటిని అందులో పోసి మధ్య మధ్యలో కదిలిస్తూ నాలుగైదు నిముషాలు ఉడికించాలి. గరం మసాలా వేసి బాగా కలపాలి. ఇప్పుడు మరలా నాలుగైదు నిముషాలు ఉడికిన తరువాత దింపాలి. ఇది మామూలు పూరీతోనూ, పాలకూర పూరీలతోనూ తింటే రుచిగా ఉంటుంది.

రుచి

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన
రైతువాణి
మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ,
క్యాలెండర్ ఉచితంగా
పొందండి.

వ్యవసాయరంగ
సంక్షోభానికి, రైతు నష్టాలకు
కారణాలను విశ్లేషించి
పరిష్కారాన్ని చూపేది
మన రైతువాణి

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక